ఈనాడు
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం అక్టోబరు 2, 2024


## ఇరుకు.. గొయ్యితో వణుకు



నెల్లూరు జాతీయ రహదారి విస్తరణ పనులు రెండువైపులా జరుగుతున్నాయి. గొలగమూడి రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. ఇక్కడ వాహనదారులు ఎవరికి వారు దూసుకెళ్తుంటారు. దీనికితోడు అక్కడ వంతెన కోసం గొయ్యి తవ్వారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదమే. ఇక్కడ పరిస్థితిని సూచించేలా కనీస ఏర్పాట్లు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.
– ఈనాడు, నెల్లూరు

## దసరాకు 80కి పైగా ప్రత్యేక బస్సులు




నెల్లూరు(రవాణా), న్యూస్‌టుడే: దసరా పండగ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ నెల్లూరు రీజియన్ 80కి పైగా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసిందని జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.మురళీబాబు ప్రకటనలో పేర్కొన్నారు. ప్రత్యేక బస్సులు ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు నడవనున్నాయన్నారు. 8వ తేదీన హైదరాబాద్ నుంచి నెల్లూరుకు ఆరు బస్సులు, 9న 11, 10న 20, 11న 26 బస్సుల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దసరా రోజుల్లో బెంగళూరు నుంచి ప్రతి రోజూ రెండు ప్రత్యేక బస్సులు నడుస్తాయని వివరించారు. విజయవాడ, చెన్నై, కడప నుంచి అయిదు బస్సుల చొప్పున నెల్లూరుకు తిరుగుతాయని తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం మరిన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

## పండగలా పింఛన్ల పంపిణీ

**మొదటి రోజు 97.42 శాతం**

నెల్లూరు(కలెక్టరేట్, స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: ఎన్టీఆర్ భరోసా పథకం కింద పింఛన్ల పంపిణీ మంగళవారం జిల్లా వ్యాప్తంగా పండగ వాతావరణంలో జరిగింది. ఉదయాన్నే సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి నగదును అందజేశారు. పలు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పెద్దచెరుకూరులో ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. జిల్లాలోని 3,09,711 మంది వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ఉండగా.. 3,01,728 మందికి అందించారు. మొదటి రోజే 97.42 శాతం పంపిణీ పూర్తి చేశారు. 7,983 మందికి అందించాల్సి ఉంది. వీరికి బుధవారం పంపిణీ చేయనున్నారు.



వృద్ధురాలికి పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

## ధాన్యం కొనుగోలుకు ముందస్తు ఏర్పాట్లు

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: జిల్లాలో 2024-25 ఖరీఫ్ పంట కాలంలో మొత్తం 37,978 ఎకరాల్లో 1,29,583 టన్నుల ధాన్యం ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందని సంయుక్త కలెక్టర్ కార్తీక్ తెలిపారు. మంగళవారం ఆయన తన ఛాంబర్‌లో ధాన్యం కొనుగోలుకు ముందస్తు ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష జరిపారు. ధాన్యం సేకరణ కేంద్రాల ప్రారంభానికి చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. ప్రభుత్వం ఎ-గ్రేడ్ రకానికి క్వింటాకు రూ. 2,320, సాధారణ రకానికి రూ. 2,300గా మద్దతు ధర నిర్ణయించిందన్నారు. అంతకు తక్కువ ధరకు విక్రయించుకునే పరిస్థితి ఏ రైతుకూ రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.


అధికారులతో సమీక్షిస్తున్న జేసీ కార్తీక్

## కన్న తండ్రులే.. కాల నాగులై!



కనురెప్పే కనుపాపను కాటేసింది..
రక్షణగా నిలవాల్సిన ముళ్లే.. గులాబీని చిదిమేసింది..
మద్యం మత్తులో.. కన్నుమిన్ను కానక.. చదువు పేరుతో దండించే నెపంతో ఒకడు..
అదే రీతిలో.. పేగు బంధమన్న స్పృహ మరిచి.. అంతకు మించిన ఉన్మాదిగా ఇంకొకడు...
బిడ్డల జీవితాలను నాశనం చేసి.. రాక్షసులుగా..
అక్షరాలకు అందని మృగాలుగా.. మాయని మచ్చగా మిగిలారు..

**జిల్లాలో రెండు చోట్ల అమానవీయ సంఘటనలు**

అల్లూరు, చేజర్ల, న్యూస్‌టుడే

### పశువులా ప్రవర్తించి...

అల్లూరు ప్రాంతంలోని ఓ కాలనీలో నివాసం ఉంటున్న ఓ వ్యక్తికి ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె ఏడో తరగతి చదువుతోంది. తండ్రి సోమవారం రాత్రి మద్యం మత్తులో పది గంటల సమయంలో ఇంటికి వచ్చాడు. వస్తూనే సరిగా చదువుకోవడం లేదని మండిపడ్డాడు. ఇంట్లోకి తీసుకువెళ్లి తలుపు వేశాడు. పశువులా ప్రవర్తించి.. కుమార్తె జీవితాన్నే నాశనం చేశాడు. తలుపు ఎందుకు వేశావని భార్య ప్రశ్నిస్తే.. సరిగా చదువుకోవడం లేదు.. మందలిస్తున్నానని బదులిచ్చాడు. ఎంతకూ తలుపు తీయకపోవడంతో అనుమానమొచ్చిన భార్య.. గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడకు వచ్చారు. దాంతో తలుపు తీసి పరారయ్యాడు. దారుణం తెలుసుకుని డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చి విచారించారు. బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కావలి రూరల్ సీఐ పాపారావు, అల్లూరు ఎస్సై కిషోర్‌బాబు విచారణ చేపట్టారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. నిందితుడిని పట్టుకుంటామని ఎస్సై తెలిపారు.

### కీచకుడిగా మారి...

చేజర్ల మండలంలోని ఓ గ్రామంలోనూ ఒకడు కీచకుడిగా మారాడు. మద్యం మత్తులో కన్న బిడ్డపైనే అఘాయిత్యానికి పాల్పడ్డారు. తనపై తండ్రి చేస్తున్న అఘాయిత్యాలను కొన్నాళ్లుగా మౌనంగా భరించిన ఆ బిడ్డ.. చివరకు తల్లితో తన గోడు వెల్లబోసుకుంది. ఆ ఘోరంపై ఆమె భర్తను నిలదీస్తే.. వారితో గొడవ పడి ఏకంగా దాడికి యత్నించాడు. తన భార్య తనతో గొడవపడి.. అభాండాలు వేస్తోందని బంధువులకు చెప్పాడు. ఆ నరకం భరించలేని తల్లి,కుమార్తెలు.. ఆ అమానవీయ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ జరిపి.. బాధితుల నుంచి వివరాలు సేకరించి, నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితుడిని మంగళవారం అరెస్టు చేసి.. కోర్టులో హాజరుపరిచారు.

## నీడై.. పరిష్కారానికి తోడై..


ఫోన్ ద్వారా సమస్య నమోదు చేసుకుంటున్న ఉద్యోగి

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నెల్లూరు నగరపాలక సంస్థ.. 150 చదరపు కి.మీ. పరిధి.. 54 డివిజన్లు, 1.56 లక్షల గృహాలు, సుమారు పది లక్షల జనాభా.. ఇంత పరిధిలో.. సాధారణ చర్యలతో ప్రజా సమస్యల పరిష్కారం అధికారులకు సవాలైతే.. అదే సమయంలో ప్రజలు తమ ఇబ్బందులను ఎవరికి చెప్పుకోవాలో తెలియక.. చెప్పినా పలికేవారు లేక ఉసూరుమంటున్న పరిస్థితి.. ఈ పరిస్థితుల్లో నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ ఓ ఊరటగా కనిపిస్తోంది.

● నెల్లూరు నగరం 53వ డివిజన్ వెంకటేశ్వరపురం గాంధీ గిరిజన కాలనీలోని పంట కాలువ పిచ్చి మొక్కలు, గుర్రపు డెక్క, వ్యర్థాలతో నిండిపోయింది. దీంతో ఏటా కాలనీ ముంపు భారిన పడుతోందని స్థానికులు ఫిర్యాదు చేశారు. పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించిన అధికారులు.. టెండర్లు పిలిచి పూడిక తీత పనులు చేపట్టారు.

● హరనాథపురంలో డ్రైనేజీ నిర్మించాలని పలువురు మహిళలు హెల్ప్‌లైన్‌కు సమస్య వివరించారు. కాలువలు శిథిలావస్థకు చేరుకోవడంతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. దీంతో కాలువల నిర్మాణానికి టెండర్లు పిలిచేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

### గత నెల 18న...

నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలు.. తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు కమిషనర్ సూర్యతేజ ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్లు ఏర్పాటు చేశారు. కమాండ్ కంట్రోల్ సెంటరులో గత నెల 18న ఈ ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి.. సిబ్బందిని నియమించారు.

**ఇదీ పరిస్థితి**

| వచ్చిన సమస్యలు | | పరిష్కారమైనవి |
|---|---|---|
| 61 | హెల్ప్‌లైన్ | 52 |
| 71 | వాట్సాప్ | 60 |
| 110 | ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ | 95 |

### సత్ఫలితాలిస్తున్న ప్రత్యేక హైల్ప్‌లైన్

'గత అయిదేళ్ల వైకాపా ప్రభుత్వం నగర సమస్యలను గాలికి వదిలేసింది. కౌన్సిల్ సమావేశాలు మొక్కుబడిగానే సాగాయి. ప్రజలు ఎన్నుకున్న కార్పొరేటర్లు స్థానిక సమస్యలపై గళమెత్తిన దాఖలాలు లేనేలేవు. నగరంలో పారిశుద్ధ్యం, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, వీధి కుక్కలు, వీధి దీపాలు తదితర సమస్యలతో ప్రజలు అల్లాడిపోయారు.'

ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పని చేసేలా చర్యలు చేపట్టారు. ప్రజలు సమస్యలను 9494018118 నంబరుకు వాట్సాప్ ద్వారా, 0861-2356777, 2316777 నంబర్లకు ఫోన్ చేసి తెలుపవచ్చు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల ద్వారానూ తెలిపేందుకు అవకాశం కల్పించారు. వాటిని 48 గంటల్లోనే పరిష్కరిస్తామని ప్రకటించారు.

### విస్తృత అవగాహన...

నగర ప్రజలు హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి.. సమస్యలను తెలిపితే తక్షణమే స్పందించి పరిష్కరిస్తాం. నిర్దేశిత ఫోన్ నంబర్లు ప్రజలకు అందుబాటులో ఉండేలా.. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, కూడళ్లు, సచివాలయ భవనాల్లో ప్రదర్శించి.. విస్తృత ప్రచారం కల్పిస్తున్నాం.
– సూర్యతేజ, కమిషనర్

## జిల్లాలో 182 మద్యం దుకాణాలు



నెల్లూరు (నేర విభాగం) : నూతన మద్యం విధానానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా- కలెక్టర్ ఆనంద్ 2024-26 సంవత్సరానికి జిల్లాలో 182 దుకాణాలకు మంగళవారం గెజిట్ విడుదల చేశారు. దుకాణాలు, ఫీజుల వివరాలను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీనివాసరావు తన ఛాంబర్‌లో వెల్లడించారు. సమావేశంలో ఏసీ పి.దయాసాగర్, ఈఎస్ ఎ.శ్రీనివాసులు నాయుడు, ఐఎంఎల్ డిపో మేనేజరు ఆయేషా బేగం పాల్గొన్నారు.

### ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ..

నూతన మద్యం విధానంలో భాగంగా దరఖాస్తు ఫీజు రూ. 2 లక్షలుగా నిర్ణయించారు. దరఖాస్తులను ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చు. ఆఫ్‌లైన్‌లో భాగంగా జిల్లాలో 11 ఎక్సైజ్ స్టేషన్లలో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇతర రాష్ట్రాల వారు సైతం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. మంగళవారం నుంచే స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల తొమ్మిదో తేదీ సాయంత్రం అయిదు గంటల్లోపు దరఖాస్తులు అందించాల్సి ఉంటుంది. 11వ తేదీ ఉదయం 8 గంటలకు కలెక్టర్ ఆధ్వర్యంలో.. కస్తూర్బా కళాక్షేత్రంలో లాటరీ డ్రా ద్వారా ప్రొవిజినల్ లైసెన్సులు మంజూరు చేయనున్నారు. కాగా.. తొలిరోజు ఒక్క దరఖాస్తూ దాఖలు కాలేదు.. బుధవారం నుంచి ప్రక్రియ ఊపందుకోనుంది.

**రూ.115.70 కోట్ల ఆదాయం..** ప్రభుత్వం విధించిన లైసెన్సు ఫీజుల ప్రకారం. . జిల్లాలో రూ. 85 లక్షల ఫీజులున్న దుకాణాలు 36, రూ. 65లక్షలు ఉన్నవి 48, రూ.55 లక్షలు ఉన్నవి 98 ఉన్నాయి. ఈ లెక్కన అన్నింటికి అనుమతులు ద్వారా ఈ ఏడాదికి ప్రభుత్వానికి రూ. 115.70 కోట్ల ఆదాయం రానుంది. నెల్లూరు నగరంలో అత్యధికంగా 30 దుకాణాలు ఏర్పాటు కానున్నాయి.



## పల్లెకు ప్రగతి శోభ





న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

**గ్రామసభలతో నిధుల వరద ● జిల్లాకు రూ. 80 కోట్లు మంజూరు**

గ్రామసభల నిర్వహణ ఫలితం.. పల్లెకు మంచి రోజులను తీసుకొస్తోంది. ఇప్పటికే డ్వామా అధికారులకు.. రాష్ట్ర అధికారుల నుంచి ఆ మేరకు మౌఖిక ఆదేశాలు అందాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆగస్టు 23న జిల్లా వ్యాప్తంగా ఒకేసారి 722 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించిన విషయం తెలిసిందే.. వాటికి అన్ని చోట్లా మంచి స్పందన లభించింది. గ్రామానికి ఏయే పనులు కావాలి? వాటికి ఎంత నిధులు అవసరం? ఉపాధిహామీ పథకంలో ఎన్నింటికి? ఎంత ప్రతిపాదనలు పెట్టాలి? తదితర అంశాలపై ప్రజల మధ్య చర్చ జరిగేలా సభలు సాగాయి. ఫలితంగా కేంద్రం నుంచి జిల్లాకు ఉపాధి పథకం కింద నిధులు కేటాయించారు.

### శాసనసభ్యుల సూచనలతో..

నియోజకవర్గాల వారీగా కేటాయించే నిధులను బట్టి.. వెంటనే సీసీ డ్రెయిన్లు, బీటీ రోడ్లు, గ్రావెల్, సీసీ, డబ్ల్యూ బీఎం రోడ్ల పనులకు నిధులు కేటాయిస్తారు. పంచాయతీరాజ్ అధికారులు స్థానిక శాసనసభ్యుల సూచనలు తీసుకుని. . ఏ మండలానికి ఎంత నిధులు కేటాయించాలి? ఏయే పనులు చేయాలనే అంశంపై కసరత్తు ప్రారంభించనున్నారు.

### ఉద్యానశాఖకు రూ. పది కోట్లు

మెటీరియల్ కాంపోనెంట్ కింద జిల్లాకు రూ. 80 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో రూ. పది కోట్లు ఉద్యానశాఖకు.. మిగిలిన రూ. 70 కోట్లు ఆత్మకూరు, కోవూరు, కావలి, కందుకూరు, సర్వేపల్లి, ఉదయగిరి, వెంకటగిరి పరిధిలోని మండలాలకు కేటాయించనున్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఒకే మండలం ఉన్నందున.. రూ. 68 లక్షలు ఇవ్వనున్నారు. గతంలో జరిగిన ఉపాధి పనులను లెక్కవేసి.. వాటి ఆధారంగా ఎక్కువ జరిగిన నియోజకవర్గాలకు కాస్త అధికంగా.. మిగిలిన వాటికి కాస్త తక్కువ కేటాయిస్తారు. ఆ మేరకు డ్వామా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

### కసరత్తు చేస్తున్నాం..

గ్రామసభల్లో జరిగిన చర్చ ఆధారంగా సుమారు రూ. 80 కోట్లు మంజూరయ్యాయి. ప్రతి నియోజకవర్గానికి నిధుల కేటాయింపుపై కసరత్తు చేస్తున్నాం. పంచాయతీరాజ్ అధికారుల ఆధ్వర్యంలో పనులు జరగనున్నాయి. స్థానిక శాసనసభ్యుల సలహా మేరకు ఆయా పనులు చేయడానికి సిద్ధమవుతున్నాం. త్వరలో కలెక్టర్ ద్వారా మంజూరు తీసుకుని.. పీడీ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్‌కు పంపుతాం.
– ఎం.లక్ష్మీనారాయణ, ఏపీడీ, డ్వామా



## ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు




నెల్లూరు(నగరపాలక సంస్థ), న్యూస్‌టుడే: నగర పాలకసంస్థ పరిధిలోని ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి నోటీసులు జారీ చేయాలని కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. ఖాళీ స్థలాల్లో నీటి నిల్వలపై ఇటీవల 'ఈనాడు'లో 'వ్యాధుల ముప్పు' శీర్షికన కథనం, మంగళవారం 'సారూ.. 'మీరైతే ఇళ్ల మధ్య ఉండగలరా' శీర్షికన చిత్ర కథనం ప్రచురితమైంది. స్పందించిన కమిషనర్ మంగళవారం రైల్వేఫీడర్స్ రోడ్డు, రంగనాయకులపేట, మూలాపేట, గణేశ్ ఘాట్, హరనాథపురం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ హరనాథపురంలో ఖాళీ ప్లాట్లను పరిశీలించారు. ప్లాట్లను పరిశుభ్రంగా ఉంచుకోని వాటిని గుర్తించి యజమానులకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. ఖాళీ ప్లాట్లలో నగరపాలకసంస్థ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. గణేశ్ ఘాట్ వద్ద పశువులను కట్టివేయడం, పరిసరాలను అపరిశుభ్రం చేయడంపై ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య, రెవెన్యూ విభాగం అధికారి సమత్ తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీలో బదిలీల రగడ

**జిల్లా పరిషత్తులో ఉద్యోగుల బదిలీల విషయం వివాదాస్పదంగా మారింది. మూడు రోజుల కిందటి వరకు ఇక్కడ బాధ్యతలు నిర్వహించి.. బదిలీపై వెళ్లిన సీఈవో కన్నమనాయుడు, ఉప సీఈవో చిరంజీవిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ కలెక్టర్, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్ కల్యాణ్‌కు ఫిర్యాదు చేయడం తీవ్ర చర్చనీయాంశమైంది.**

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే

రాష్ట్ర ప్రభుత్వం గత నెల 17న ఉద్యోగుల బదిలీల ఉత్తర్వులు జారీ చేసింది. జడ్పీలో సీఈవోగా, ఉప సీఈవోగా బాధ్యతలు నిర్వహించిన కన్నమనాయుడు, చిరంజీవి.. ఎంపీడీవోల బదిలీల జాబితా తయారు చేసి.. జడ్పీ ఛైర్‌పర్సన్‌కు పంపి.. నోట్ ఫైల్‌పై సంతకం తీసుకున్నారు. ఈ లోపు కొత్తగా నియమితులైన సీఈవో, ఉప సీఈవోలు ఇక్కడ బాధ్యతలు స్వీకరించగా.. వారు రాత్రికి రాత్రి రిలీవ్ అయ్యారు. వారు రిలీవ్ అవుతూ.. ఇష్టానుసారం జడ్పీలో పని చేసే పరిపాలనాధికారులు, సీనియర్, జూనియర్‌సహాయకులు, ఇతర సిబ్బందిని బదిలీ చేశారని ఛైర్‌పర్సన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ జాబితాను తనకు పంపకుండా.. కనీసం నోట్‌ఫైల్ కూడా ఇవ్వకుండా వెళ్లిపోయారని ధ్వజమెత్తారు.




### చర్యలు తీసుకోవాల్సిందే...

అదే విషయమై.. ఛైర్‌పర్సన్ అరుణమ్మ మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మొత్తం పరిస్థితిపై ఇప్పటికే కలెక్టర్, రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్, మంత్రికి ఫిర్యాదు చేశామని తెలిపారు. సదరు అధికారులు చేసిన బదిలీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోతే.. న్యాయపోరాటానికి సిద్ధమవుతామని ప్రకటించారు. మరోవైపు ఈ మొత్తం పరిస్థితులతో.. జడ్పీలో బదిలీ అయిన ఉద్యోగులు ఇరకాటంలో పడ్డారు.

## ఒకే పోలీసుస్టేషన్‌లో 9 మంది బదిలీ

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: నగరంలోని నెల్లూరు గ్రామీణ పోలీసు స్టేషన్ ఎదుట తెదేపా నాయకులు నిరసనకు దిగారు.. ఇది జరిగిన రెండు రోజుల వ్యవధిలో తొమ్మిది మంది పోలీసు అధికారులు, సిబ్బంది బదిలీ అయ్యారు. ఈ సంఘటన పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారింది. వీరిలో ఏఎస్సైలు శ్రీనివాసులురెడ్డిని పొదలకూరుకు, రవిచంద్రను మనుబోలుకు, హెడ్ కానిస్టేబుళ్లు వేణును రాపూరుకు, మస్తాన్‌రావును ఆత్మకూరుకు, భాస్కర్‌ను పొదలకూరుకు, ప్రసాద్‌ను కందుకూరుకు, కానిస్టేబుళ్లు అల్లాబక్షును విడవలూరుకు, మునికృష్ణను వలేటివారిపాలెం, శ్రీనును ఉలవపాడుకు బదిలీ చేశారు.

## టెట్‌కు సన్నద్ధం
### రాష్ట్ర పరిశీలకులు నాగేశ్వరరావు



విట్స్ కళాశాలలో పరీక్షా ఏర్పాట్లు పరిశీలిస్తున్న నాగేశ్వరరావు, విద్యాధికారులు

**కావలి, న్యూస్‌టుడే:** ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఈ నెల 3వ తేదీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని రాష్ట్ర పరిశీలకులు, ఓపెన్ స్కూల్ సంచాలకులు నాగేశ్వరరావు వెల్లడించారు. మంగళవారం పట్టణంలోని పీబీఆర్ విట్స్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో నాలుగు కేంద్రాల్లో ఈ పరీక్ష జరుగుతుందన్నారు. పీబీఆర్‌తో పాటు బోగోలు మండలంలోని కడనూతల ఆర్ఎస్ఆర్, నెల్లూరు నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలు, పొట్టిపాలెంలోని అయాన్ కేంద్రంలో పరీక్షలు జరుగుతాయన్నారు. అభ్యర్థులకు తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్తు, వైద్య సదుపాయాలు కల్పించామన్నారు. ఆయన వెంట పలువురు అధికారులు ఉన్నారు.

## నిర్లక్ష్యానికి నిదర్శనం



జిల్లాలో కందలేరు వద్ద గతంలో మట్టికట్ట నిర్మాణానికి తీసుకువచ్చిన యంత్రం (క్రషర్) ఇది. మట్టిని దంబుల్ చేసేది. పనులు పూర్తయిన తరువాత మట్టికట్ట వద్దే ఇలా వదిలేయడంతో అందులో గుబురుగా మొలిచిన చిన్న మొక్క మానై కాయలు కాసింది. రూ.లక్షల విలువజేసే యంత్రాన్ని భద్రపరచకుండా వదిలేయడమేంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. - ఈనాడు, నెల్లూరు

## బసవతారకం ఆస్పత్రిలో మహిళా రోగులకు ఉచిత కన్సల్టేషన్

**బంజారాహిల్స్, న్యూస్‌టుడే:** బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో అక్టోబరు 1 నుంచి 20వ తేదీ వరకు మహిళా క్యాన్సర్ రోగులకు ఉచిత కన్సల్టేషన్ ఉంటుందని ఆసుపత్రి వర్గాలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపాయి. అక్టోబర్ నెలను రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసంగా వ్యవహరిస్తారు. నేపథ్యంలో 'ప్రివెంటివ్ ప్రోగ్రామ్ ఫర్ ఉమెన్' పేరిట ఈ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. అన్ని పనిదినాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కన్సల్టేషన్ ఉంటుందని, మామోగ్రామ్ పరీక్షల్లో 25 శాతం రాయితీ, ఇతర పరీక్షల్లో 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు వెల్లడించారు. వివరాలకు ఫోన్‌నం. 040-23551235, 23550967లను సంప్రదించవచ్చని సూచించారు.

## క్రీడల్లో అదాని పాఠశాల విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

**ముత్తుకూరు, న్యూస్‌టుడే:** నెల్లూరులో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల్లో అదాని పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. జిల్లాస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో రాణించిన ఏడుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిరియాల సత్యనారాయణ తెలిపారు. వీరితో పాటు అండర్-14 త్రైక్వాండో పోటీల్లో రాణించిన లాస్యప్రియ ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైందన్నారు. కార్యక్రమంలో అకడమిక్ హెడ్ రాజేష్, సమన్వయకర్తలు సుమన్, దేవకి, ఉషలు పాల్గొన్నారు.

## వయోభారమని వదిలేస్తే.. తిరిగిరాని లోకాలకెళ్లే!



**అనంతసాగరం, న్యూస్‌టుడే:** ఓ దంపతులను వయోభారమని దత్త కుమార్తె, అల్లుడు వదిలేయడంతో.. వారి ప్రాణాలు తల్లడిల్లాయి. జరిగిన అవమానానికి మనస్తాపంతో కుంగిపోయి.. అనారోగ్యం బారినపడ్డారు. దంపతులిద్దరూ ఒకరికొకరు చేదోడువాదోడుగా ఉండేవారు. ధైర్యం చెప్పుకొని ఎంత ఓదార్చుకున్నప్పటికీ.. విధి వారిని వీడలేదు. తీవ్ర స్థాయిలో కుమిలిపోయిన బండి లక్ష్మమ్మ(54) సోమవారం రాత్రి ప్రాణాలొదిలింది. గత కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతూ.. తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయిందని భర్త రమణయ్య బోరున విలపిస్తూ వివరించారు.

### సెప్టెంబరు 28న ఏం జరిగిందంటే..

గత నెల 28న సోమశిలలోని సోమేశ్వరాలయం వద్ద దత్త కుమార్తె, అల్లుడు వయోభారమని బండి రమణయ్య, లక్ష్మమ్మలను వదిలేసిన సంగతి విదితమే. కానిస్టేబుల్ పెంచలయ్య చొరవ తీసుకొని వీరిని సోమశిల హిల్‌కాలనీలో తన బంధువుల ఇంట్లో ఉంచారు. ఈ క్రమంలో రమణయ్య దంపతులు జరిగిన ఘటనను తలుచుకుంటూ.. రోజూ మనోవేదనకు గురయ్యారని స్థానికులు చెబుతున్నారు. కన్నబిడ్డ అన్నపానీయాలూ చేసుకుంటూ కుమిలిపోయేవారు. ఈ క్రమంలో తీవ్ర అస్వస్థతకు లోనైన లక్ష్మమ్మ ప్రాణాలొదిలింది. దీంతో ఆమె భర్త కన్నీరుమున్నీరవుతున్నారు. ఆమె అంత్యక్రియలకూ కానిస్టేబుల్ పెంచలయ్య సహాయ, సహకారాలు అందించారని బంధువులు వివరించారు

# సైబర్ మోసాలకు చెల్లు

- పోలీసుస్టేషన్ ఏర్పాటుకు చర్యలు
- సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సిబ్బంది



- బ్యాంకు నుంచి మాట్లాడుతున్నాం.. మీకు క్రెడిట్ కార్డు వచ్చింది. పాత కార్డు నంబరు చెబితే కొత్తది వస్తుందని చెప్పి, సీవీవీ నంబరు తీసుకుని ఏకంగా రూ.17 లక్షలు తీసుకున్నారు. ఈ ఘటన నెల్లూరు నగరంలో చోటు చేసుకుంది.
- ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చే అర్జీల్లో 50 శాతం సైబర్ మోసాల బారిన పడే బాధితులు కావడం విశేషం. - న్యూస్‌టుడే, నెల్లూరు (నేర విభాగం)

జిల్లాలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. బ్యాంకుకు అనుసంధానం ఉన్న నంబర్లకు అనామకులు ఫోన్లు చేసి ఉన్నదంతా దోచుకుంటున్నారు. షేర్ మార్కెట్లో పెట్టుబడులు, నకిలీ యాప్‌ల పేరుతో దోచుకోవడం, మ్యాట్రిమోనీ మోసాలు, నకిలీ వెబ్‌సైట్లు ఇలా ఒక్కటేమిటీ ప్రతిదీ సైబర్ నేరాళ్లకు మాయం చేస్తున్నారు. రూ.వెయ్యి నుంచి రూ.లక్షలు పోగొట్టుకున్న బాధితులు ఉన్నారు. ఎక్కడ ఫిర్యాదులు చేయాలో.. ఎవరిని సంప్రదించాలో తెలియక చాలా మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం వీటికి చెక్ పెట్టేందుకు చర్యలు చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా సైబర్ నేరాలు పెరిగిన నేపథ్యంలో జిల్లాకు ఒక సైబర్ పోలీసుస్టేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.



పోలీసు కార్యాలయం

### వెసులుబాటు..

ఆధునిక పరిజ్ఞానంతో దేశంలో ఎక్కడి నుంచైనా సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. మోసపోయిన బాధితులు ఫిర్యాదు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. పోలీసు స్టేషన్లలో చెప్తే తమ పరిధి కాదని.. పోలీసు కార్యాలయానికి వెళ్లాలని సమాధానం ఇస్తున్నారు. అక్కడకు వెళితే ఎన్నో సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాకు సైబర్ పోలీసు స్టేషన్ మంజూరైతే నేరుగా ఫిర్యాదు చేసేందుకు వెసులుబాటు ఉంటుంది. జిల్లాలో ఎక్కడ నేరం జరిగినా వెంటనే నేరుగా స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయొచ్చు. నేరం జరిగిన గంటల వ్యవధిలోనే నగదు తిరిగి వచ్చే అవకాశాలు ఉన్నాయి. లేదంటే రాష్ట్ర ఉన్నతాధికారులకు సమాచారం అందించి నేరస్థులను పట్టుకునే వీలుంటుంది.

### జిల్లా కేంద్రంలోనే..

జిల్లా కేంద్రంలోనే సైబర్ పోలీసుస్టేషన్ ఏర్పాటు చేయనున్నారు. సాధారణంగా సీసీఎస్, మహిళా పోలీసు స్టేషన్ వంటివి జిల్లా కేంద్రంలోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో సైబర్ పోలీసుస్టేషన్ కూడా ప్రత్యేకంగా ఎక్కడైనా ఏర్పాటు చేస్తారా? అనేది వేచి చూడాల్సి ఉంది. లేదంటే గతంలో జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలోనే సైబర్ ఫిర్యాదులు తీసుకునేవారు. ఎస్పీ కార్యాలయం కూడా అక్కడే ఉంది. అక్కడే ప్రత్యేకంగా సైబర్ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేస్తారని పలువురు భావిస్తున్నారు. ప్రస్తుతం సైబర్ క్రైమ్ ఎస్సై స్థాయి అధికారి, ఒక హెడ్ కానిస్టేబుల్, ఏడుగురు కానిస్టేబుళ్లు ఉన్నారు. స్టేషన్ మంజూరైతే సీఐ స్థాయి అధికారితో పాటు సాంకేతిక పరిజ్ఞానం కలిగిన సిబ్బందిని సమకూర్చనున్నారు. దర్యాప్తునకు అవసరమైన సాంకేతిక పరికరాల్ని అందజేయనున్నారు.

### ప్రతి సైబర్ నేరం దర్యాప్తు : జి.కృష్ణకాంత్, ఎస్పీ

రాష్ట్ర వ్యాప్తంగా సైబర్ పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఇంకా సమాచారం అందలేదు. జిల్లా కేంద్రంలోనే ఏర్పాటు చేస్తారు. ప్రతి సైబర్ నేరాన్ని దర్యాప్తు చేయడమే స్టేషన్ ప్రత్యేకం.

## గుండెపోటుతో రైతు మృతి



కాసా రమణారెడ్డి(పాత చిత్రం)

**అనంతసాగరం, న్యూస్‌టుడే:** బొమ్మవరం పంచాయతీ అగ్రహారానికి చెందిన కాసా రమణారెడ్డి(52) తన పొలంలో పనిచేస్తూ గుండెపోటుతో మంగళవారం మధ్యాహ్నం మృతి చెందారు. రెక్కాడితేగాని డొక్కాడని నిరుపేద రైతు కుటుంబానికి ఇంటి పెద్దే దిక్కు. హఠాన్మరణం వల్ల దిక్కుతోచని స్థితిలో ఉంది. మృతుడికి భార్య పద్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

## వృద్ధురాలిని ఏమార్చి.. డబ్బు దొంగిలించి

**సంగం, న్యూస్‌టుడే:** సంగంలోని కెనరా బ్యాంకు లోపల మంగళవారం మాటు వేసిన ఇద్దరు ఆగంతుకులు ఓ వృద్ధురాలిని మోసం చేసి రూ.16వేల నగదు అపహరించారు. తరుణవాయికి చెందిన సీహెచ్ సుగుణమ్మ బ్యాంకులో క్యాషియర్ నుంచి రూ. 50వేల నగదు తీసుకున్నారు. ఈ క్రమంలో వెనుతిరిగిన ఆమె వద్దకు ఇద్దరు యువకులు వచ్చారు. 'నీవు తీసుకున్న నగదు సక్రమంగా లేదనీ, లెక్కిస్తామంటూ' ఆమె వారిస్తున్నా వినకుండా తీసుకున్నారు. లెక్కవేస్తున్నట్లు నటిస్తూ రూ.16వేలు అపహరించి, ఆమెకు మిగిలిన నగదు అప్పగించి క్షణాల్లో అదృశ్యమయ్యారు. బ్యాంకు సిబ్బంది గమనించి సీసీ కెమెరాలు పరిశీలించగా.. వాస్తవమని తేలింది. దొంగలిద్దరూ ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బ్యాంకర్లు తెలిపారు.

## ఆశా కార్యకర్త పనితీరుపై విచారణ
### గ్రామంలో ఉద్రిక్తత



వాదులాడుకుంటున్న ఆశా యూనియన్ సభ్యులు, గ్రామస్థులు

**కలిగిరి, న్యూస్‌టుడే:** మండలంలోని రావులకొల్లు ఆశా కార్యకర్త పి.విజయమ్మ పనితీరుపై గ్రామంలో డీఎంహెచ్‌వో పెంచలయ్య, పలువురు సిబ్బంది మంగళవారం విచారణ చేపట్టగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆమెను విధుల నుంచి తొలగించడంతో ఆశా, సీఐటీయూ యూనియన్ సభ్యులు ఇటీవల నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కలెక్టర్‌ను కలిసి విధుల్లోకి తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఆయన ఆదేశాలతో జిల్లా వైద్యాధికారి గ్రామానికి వచ్చి ఇంటింటికీ వెళ్లి విచారిస్తున్నారు. వారితో పాటు ఆశా యూనియన్ సభ్యులు రావడంతో గ్రామస్థులు అభ్యంతరం తెలిపారు. దీంతో వాదనలు జరగడంతో ఉద్రిక్తత నెలకొంది. చివరకు అధికారులే విచారించారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి గీతారెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## 3 నుంచి చాముండేశ్వరి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు



శరన్నవరాత్రి ఉత్సవాల గోడప్రతులను ఆవిష్కరిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

**ఇందుకూరుపేట, న్యూస్‌టుడే:** ఇందుకూరుపేట మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన గంగపట్నం చాముండేశ్వరి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాల గోడప్రతులను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి నెల్లూరులోని వారి స్వగృహంలో మంగళవారం ఆవిష్కరించారు. ఆలయ ఈవో తాతా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేమిరెడ్డి దంపతులను ఆహ్వానించారు. ఈనెల 3 నుంచి 12వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కల్యాణ్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వీరేంద్రనాయుడు, హరికుమార్ రెడ్డి, ఈవో తదితరులు పాల్గొన్నారు.

## వీఎస్‌యూలో జాబ్‌మేళా 4న

**వెంకటాచలం, న్యూస్‌టుడే:** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, జిల్లా ఉపాధి కార్యాలయం, సిడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 4న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు వీఎస్‌యూ అధికారులు తెలిపారు. ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్, ఇన్నోవ్‌సోర్స్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీరాం లైఫ్ ఇన్సూరెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర సంస్థలు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇంటర్, డిగ్రీ పూర్తయిన, నిరుద్యోగ యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ముగిసిన గంధోత్సవాలు



ఏఎస్‌పేటలో హాజరైన భక్తులు

**అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే:** హజరత్ ఖాజా నాయబ్ రసూల్ దర్గాలో మంగళవారం తహలీల్ ఫాతెహా ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా హఫీజ్ ఇంటి నుంచి ఫాతెహా చదివింపుల వస్తువులు, పూలచద్దర్లు దర్గాకు తీసుకెళ్లారు. తొలుత స్వామివారి జపమాలలను పోలీసు బందోబస్తు మధ్య భక్తులకు చూపారు. నాయబ్‌రసూల్ ఉపయోగించిన జపమాలలను భక్తులు తాకి భక్తిశ్రద్ధలతో తన్మయానికి లోనయ్యారు. అనంతరం ఫాతెహా చదివింపులు చేశారు. దర్గా పరిపాలనా కార్యాలయం వద్ద భక్తులకు గంధం పంపిణీ చేశారు. ఈవో మహ్మద్ హుస్సేన్ పర్యవేక్షించారు.



కసుమూరులో..

**వెంకటాచలం :** కసుమూరులో మూడు రోజులుగా జరుగుతున్న మస్తాన్‌వలీ గంధ మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. చందన్‌మహల్ నుంచి గ్రామోత్సవంగా దర్గా వద్దకు తీసుకొచ్చారు. ముజావర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కడప పీఠాధిపతి ఆరీఫుల్లా హుస్సేనీ దర్గాలోని మస్తాన్‌వలీ సమాధిపై సుగంధ ద్రవ్యాలు, గంధం పొడిని చల్లి తహలీల్ ఫాతెహా కార్యక్రమం నిర్వహించారు. ఇరుపూరు జయకుమార్, రాజా, తరుణ్‌తేజ, మనోజ్, మస్తాన్‌రావు ప్రత్యేక కచ్చేరి ఆకట్టుకుంది.

## మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

**కోవూరు :** మద్యానికి బానిసై ఫ్యానుకు చీరతో ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పడుగుపాడులోని మసీదు వీధిలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.... పడుగుపాడుకు చెందిన షరీఫ్(22) నెల్లూరులోని భగత్‌సింగ్ కాలనీకి చెందిన యువతిని మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు సంతానం. ఆటో నడుపుతూ మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవపడుతున్నారు. అయిదు రోజుల క్రితం ఆమె పిల్లలతో పుట్టింటికెళ్లారు. ఇంటికి రావాలని కోరగా నిరాకరించింది. మద్యం తాగిన షరీఫ్ తల్లి వరండాలో నిద్రిస్తుండగా బెడ్‌రూంలో వెళ్లి ఫ్యానుకు చీరతో ఉరేసుకున్నారు. తల్లి గమనించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. నెల్లూరు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంగనాథ్‌గౌడ్ తెలిపారు.

## సమాచార స్రవంతి

### బంగారం ధరలు

| | |
|---|---|
| గ్రాము ధర: | రూ. 7,277 |
| (3 శాతం జీఎస్టీ కలిసిన ధర) | |
| సవర ధర: | రూ. 58,216 |
| వెండి గ్రాము : | రూ. 95.60 |

### వెంకాబ్ కోళ్ల ధరలు

| | |
|---|---|
| బ్రాయిలర్ (రైతుధర) | 111 |
| రిటైల్ | 133 |
| లేయర్ | 115 |
| బ్రాయిలర్స్ | 193 |
| బ్రాయిలర్స్ స్కిన్‌లెస్ | 219 |
| లేయర్ మాంసం | 195 |
| **నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్** | |
| బ్రాయిలర్ | 121 |
| లేయర్ | 110 |
| బ్రాయిలర్స్ | 218 |
| బ్రాయిలర్స్ స్కిన్‌లెస్ | 244 |
| లేయర్ మాంసం | 187 |



# అభిమతం.. సమాజహితం

## కొత్త ప్రాజెక్టుకు పేటెంట్



లెగ్ ఆపరేటెడ్ వాటర్ డిస్పెన్సర్

**కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే:** ఆధునిక కాలంలో మనుషులు చేయలేని, సాధ్యపడని పనులను కూడా రోబోల సాయంతో చేస్తుండటం విశేషం. ఎంత సాంకేతికత పెరిగినా.. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటించకపోతే ఇబ్బందులు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కరోనా తర్వాత కొంతమందికి మరిన్ని జాగ్రత్తలు అవసరమవుతున్నాయి. అటువంటి వారికి అతి తక్కువ ఖర్చుతో ఉపయోగపడేటువంటి సమాజహిత ఆవిష్కరణలకు శ్రీకారం చుడుతున్నారు ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు. వారు తయారుచేసిన ఓ ప్రాజెక్టుకు ఇటీవల పేటెంట్ పొంది ప్రశంసలు అందుకుంటున్నారు.

### మరిన్ని రూపకల్పనను ప్రోత్సహిస్తాం



కాలితో స్టాండ్‌ను తొక్కితే నీళ్లు విడుదలయ్యే 'లెగ్ ఆపరేటెడ్ వాటర్ డిస్పెన్సర్' కాన్సెప్ట్ ఇండియన్ ఇండస్ట్రియల్ నేషనల్ జర్నల్‌లో ప్రచురితమైంది. ఈ ప్రాజెక్టుకు పేటెంట్ కోసం దరఖాస్తు చేసుకోగా భారత ప్రభుత్వ వాణిజ్య పారిశ్రామిక విభాగం నుంచి సెప్టెంబరు 24న సర్టిఫికెట్ అందింది. భవిష్యత్తులో విద్యార్థులు మరిన్ని ప్రాజెక్టులు రూపకల్పన చేసేలా ప్రోత్సహిస్తాం.

– ప్రొఫెసర్ లక్ష్మణరావు

### తయారీ విధానం

20 లీటర్ల నీళ్ల బబుల్‌కు రెసీ ప్రొకేటింగ్ సిస్టమ్ ముఖద్వారం ద్వారా ఏర్పరిచి చతురస్రాకార స్టాండ్‌ను దానికి అనుసంధానం చేయాలి. నాలుగు ఇనుపరాడ్లు, ఇనుప స్టాండ్‌ను రెసీ ప్రొకేటింగ్ యాక్షన్‌లో అమరిస్తే లెగ్ ఆపరేటెడ్ వాటర్ డిస్పెన్సర్ తయారవుతుంది. భవిష్యత్తులో మరమ్మతుల ఖర్చులు కూడా చాలా తక్కువ. యంత్రం కింద అమర్చిన స్టాండ్‌ను కాలుతో తొక్కితే పైన కుళాయి ద్వారా నీళ్లు విడుదల అవుతాయని విద్యార్థులు తెలిపారు.

### పరికరం సృష్టికర్తలు





ఆర్టీసీ బస్టాండ్లు, విద్యా సంస్థలు, ఆసుపత్రులు తదితర రద్దీ ప్రాంతాల్లో కుళాయిలను చేతితో తిప్పి నీళ్లు తీసుకోవడం లేదా చేతులు శుభ్రం చేసుకోవడం వంటివి చేస్తుంటారు. అదే కుళాయిని ఎక్కువ మంది చేతితో తిప్పుతూ ఉండటం వల్ల ఆ కుళాయికి క్రిములు ఉండి అవి మానవ శరీరంలోకి ప్రవేశించే అవకాశం ఉంది. ముఖ్యంగా చిన్న పిల్లలపై ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఈ తరుణంలో చేతితో కాకుండా కాలుతో తొక్కడం ద్వారా(రెసిప్రొకేటింగ్ సిస్టమ్) సమస్య నివారించవచ్చని ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఈఈఈ విద్యార్థులు **కె.వెంకటేశ్, ఆర్. మోనీష** భావించారు. ఈ మేరకు కళాశాల ప్రొఫెసర్ ముప్పా లక్ష్మణరావు ఆధ్వర్యంలో లెగ్ ఆపరేటెడ్ వాటర్ డిస్పెన్సర్ ఆవిష్కరణకు శ్రీకారం చుట్టారు. చేతులు శుభ్రంగా ఉంచడం వల్ల అనేక రకాల వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చునీ, కేవలం రూ. 500 లోపు మాత్రమే ఈ యంత్రానికి ఖర్చు అవుతుందని విద్యార్థులు తెలిపారు.

# కావలి

• కావలి • ఉదయగిరి • కందుకూరు

## యోగా.. పునరుద్ధరిస్తే ఆరోగ్యమే!

న్యూస్‌టుడే, దుత్తలూరు, ఉదయగిరి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు యోగాలో శిక్షణ ఇస్తే బహుళ ప్రయోజనాలు ఉంటాయనే సదుద్దేశంతో తెదేపా ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన కార్యక్రమం వైకాపా పాలనలో పడకేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో యోగా తరగతులను పునరుద్ధరించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



నందిపాడులో యోగాసనాలు చేస్తున్న విద్యార్థినులు

### బాల్యంలోనే రుగ్మతలు

20-30 ఏళ్లు దాటక ముందే అధిక రక్తపోటు.. బడి వయసులోనే మానసిక ఒత్తిడి, నిద్రలేమి వంటి సమస్యలతో సతమతమవుతున్నారు. మంచి ర్యాంకులు సాధించాలనే పోటీతత్వం, చరవాణుల్లో వీడియో గేమ్స్‌కు పరిమితమవడం తదితర కారణాలతో ఈరుగ్మతల బారినపడుతున్నారు. ఇలాంటి సమస్యలు రాకుండా ఉండేందుకు పాఠశాల దశ నుంచే యోగాను జీవనశైలిలో భాగంగా చేసుకోవాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

ఉదయగిరి నియోజకవర్గంలో 421 ప్రాథమిక, 39 ప్రాథమికోన్నత, 51 ఉన్నత పాఠశాలలున్నాయి. నాలుగు ఆదర్శ పాఠశాలలు, నాలుగు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలున్నాయి. వీటిల్లో 33,419 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో విద్యా క్యాలెండర్‌లో యోగాకు ప్రత్యేక తరగతులు కేటాయించారు. వ్యాయామ ఉపాధ్యాయులు నిత్యం ప్రార్థనా సమయంలో విద్యార్థులతో వివిధ రకాల యోగాసనాలు వేయించేవారు. సాయంకాలం పలు పాఠశాలల్లో ప్రత్యేకంగా యోగా తరగతులు నిర్వహించేవారు. ప్రతి శుక్రవారం సూర్య నమస్కారాలు, ఏరోబిక్స్ చేయించేవారు. గత వైకాపా పాలనలో పాఠశాలల్లో యోగా తరగతుల జాడే కనిపించలేదు. పాఠశాలల్లో యోగా తరగతులను అమల్లోకి తీసుకొచ్చి చిన్నారుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**యోగాసనాలతో ఎంతో ఉపయోగం**
**లక్ష్మి, స్రవంతి, విద్యార్థినులు**

పాఠశాలల్లో విధిగా ఉదయం, సాయంత్రం యోగాసనాలు వేయించాలి. దీంతో మానసిక ఒత్తిడి దూరమై చదువుపై ప్రత్యేక దృష్టి పెడతాం. నిత్యం చేసే వివిధ రకాల ఆసనాల ద్వారా ఎంతో ఉపయోగం.

## మద్యం గొలుసు దుకాణంపై దాడులు

**జలదంకి :** గ్రామంలో కల్యాణ మండపం పక్కన ఉన్న మద్యం గొలుసు దుకాణంపై ఎస్సై లతీపున్నీసా ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం దాడులు చేశారు. మద్యం విక్రయిస్తున్న ఎం.కోటయ్యను అదుపులోకి తీసుకున్నారు. రూ.4650ల విలువైన 31 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

## చాకలకొండ దాతలతో అన్న క్యాంటీన్ నిర్వహణ

**వింజమూరు:** గ్రామంలోని ప్రధాన రహదారిలో కాకర్ల ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌ను ఈనెల ఒకటి నుంచి 30 వరకు అయ్యే ఖర్చు భరించేందుకు చాకలకొండ వాసులు ముందుకొచ్చారు. ఈమేరకు కాకర్ల సురేష్‌కు గ్రామ నాయకుడు కూనల వెంకటేశ్వర్లు నెల ఖర్చుకు అయ్యే నగదు చెక్కు మంగళవారం అందించారు. సురేష్ సతీమణి ప్రవీణ దాతలతో కలిసి భోజనం వడ్డించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు గొంగటి రఘునాథరెడ్డి, గూడా నరసారెడ్డి, చల్లా వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, కోడూరు నాగిరెడ్డి, దంతులూరి వెంకటేశ్వరరావు, గణపం సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సదుపాయాలు ఉపయోగించుకోవాలి

**కావలి, న్యూస్‌టుడే:** రాష్ట్రంలో విద్యాబోధనతోపాటు క్రీడా సదుపాయాలు ఉన్న కళాశాల తమదని, వాటిని ఉపయోగించుకోవాలని జవహర్‌భారతి ప్రిన్సిపల్ పి.సుబ్రహ్మణ్యంనాయుడు అన్నారు. మంగళవారం నూతన విద్యార్థులకు సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో స్వయం ఉపాధి కోర్సుల సంచాలకులు ఆర్.మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

## కుర్రకారు.. ఆటల్లో హుషారు

పల్లెటూళ్లలోని పేదిళ్లలో పుట్టారు. తల్లిదండ్రులు కూలి పనులు చేసి బిడ్డలను చదివిస్తున్నారు. కన్న వారి ఆశయాలకనుగుణంగా చదువుకుంటున్నారు. మరోవైపు ఇష్టమైన క్రీడల్లో సాధన చేశారు. గురువుల సూచనలతో రాటుదేలారు. పోటీల్లో పాల్గొని సత్తా చాటుతున్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈనేపథ్యంలో వీరి ప్రతిభపై కథనం.

న్యూస్‌టుడే, కావలి

యువకులు క్రీడా పోటీల్లో సత్తా చాటుతున్నారు. ప్రస్తుత సంవత్సరం రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పట్టణంలో చదువుతున్న పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. పోల్‌వాల్ట్‌లో ప్రతిభ చాటేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లా పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ఇందుకు కసరత్తు చేస్తున్నారు. పాఠశాలకు నుంచే చదువుతోపాటు క్రీడల్లో ముందంజలో నిలుస్తున్నారు. ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు వీరి మెలకువలు నేర్పిస్తున్నారు.



పోల్‌వాల్ట్ ఆడుతూ

### లోకేష్.. అథ్లెటిక్స్‌లో దిట్ట



గుడ్లూరు మండలంలోని మొండివారిపాలేనికి చెందిన కాటంగారి లోకేష్ హాస్టల్‌లో ఉంటూ ఎంపీసీ ప్రథమ సంవత్సరం చదువుకుంటున్నాడు. హార్డిల్స్, పోల్‌వాల్ట్‌లో ప్రతిభ చూపుతున్నాడు. ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో హర్డిల్స్‌లో ప్రథమ స్థానం సాధించాడు. పోల్‌వాల్ట్‌లో తృతీయ స్థానంలో నిలిచాడు. గత ఏడాది ప్రథమ బహుమతులు దక్కించుకున్నాడు. తండ్రి రమణయ్య, తల్లి లక్ష్మీపార్వతి కూలి పనులు చేస్తూ అతన్ని చదివిస్తున్నారు.

### ప్రతిభావంతుడు నాయుడు రాజేంద్ర



మండలంలోని ఒట్టూరు గ్రామానికి చెందిన నాయుడు రాజేంద్ర సీఈసీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. పోల్‌వాల్ట్‌లో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. గత ఏడాది జాతీయ స్థాయిలో జరిగిన పోల్‌వాల్ట్ పోటీల్లోనూ ద్వితీయ స్థానం సాధించాడు. అప్పట్లో రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ తరఫున నిర్వహించిన పోటీల్లో హైజంప్‌లోనూ ప్రతిభ చూపాడు. తండ్రి వెంకయ్య, తల్లి బల్లమ్మ ఇద్దరూ భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్నారు. కష్టపడి కుమారుడ్ని చదివిస్తున్నారు.

## పింఛన్ల పంపిణీ వేగవంతంగా చేయాలి

**కందుకూరు గ్రామీణం :** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీని వేగవంతంగా చేయాలని డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి సూచించారు. మంగళవారం మాచవరం, మోపాడు, కొండముడుసుపాలెంలో ఈ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**గుడ్లూరు :** ఎన్టీఆర్ భరోసా పింఛన్లు జిల్లాలో వేగవంతంగా అందజేస్తున్నామని డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి అన్నారు. మండలంలోని తెట్టు, మోచర్ల, గుడ్లూరులో మంగళవారం పింఛను పంపిణీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీడీవో వెంకటేశ్వరరావు, సర్పంచి శంకర్, పంచాయతీ కార్యదర్శి మహేశ్, భాజపా నాయకులు సుధాకర్ పాల్గొన్నారు.

### అడ్డూఅదుపు లేకుండా ఇసుక అక్రమ రవాణా

ఇసుక అక్రమ రవాణాకు అడ్డూఅదుపు లేకుండాపోతోందనేందుకు ఈ చిత్రమే నిదర్శనం. నిన్నటి వరకు ట్రాక్టర్లతో ఇసుక తరలించిన అక్రమార్కులు, నేడు లారీల ద్వారా తరలించేందుకు వెనకడుగు వేయటం లేదు. మదనగోపాలపురం సమీపంలోని మామిడితోటలో ఇసుక అక్రమంగా నిల్వ చేస్తున్నారు. ఇక్కడి నుంచి రాత్రి సమయాల్లో లారీల ద్వారా తరలిస్తున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. దీనిపై గ్రామీణ పోలీసులు మాత్రం గత నెలలో 15 కేసులు నమోదు చేశామని చెబుతున్నారు. - న్యూస్‌టుడే, కందుకూరు గ్రామీణం



### పైపులైను లీకు.. నీరు వృథా



మండల కేంద్రమైన కొండాపురంలో పంచాయతీ కార్యాలయం వద్ద పైపులైను లీకైతే నీరు వృథాగా పోతోంది. ఇదంతా పంచాయతీ కార్యాలయం పక్కనే ఉన్న వెలుగు కార్యాలయం వరకు నిల్వ ఉంటుంది. ఇటీవల జల్‌జీవన్ పథకంలో ఏర్పాటుచేసిన పైపులైన్ అప్పుడే లీకులు పడడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి ప్రదీప్‌ను వివరణ కోరగా పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు. - కొండాపురం, న్యూస్‌టుడే

### తీరం స్వచ్ఛంగా ఉండాలని..



స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని జిల్లా యువజన అధికారి మహేంద్ర పేర్కొన్నారు. నెల్లూరు నెహ్రూ యువ కేంద్రం, ఒట్టూరు ఆదర్శ పాఠశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, ప్రియదర్శిని మహిళా మండలి ఆధ్వర్యంలో మంగళవారం తుమ్మలపెంట సముద్ర తీరంలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం జరిగింది. గ్రామంలో ర్యాలీ నిర్వహించి తీరంలో వ్యర్థాలు తొలగించారు. - న్యూస్‌టుడే, కావలి గ్రామీణం

### శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

దగదర్తిలోని దుర్గాభవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు తీర్థసంగ్రహణంతో మంగళవారం మొదలయ్యాయి. రామలింగేశ్వరుడికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, హోమం నిర్వహించారు. సాయంత్రం మృత్సంగ్రహణ (పుట్టమట్టి), అంకురార్పణ కార్యక్రమాలు జరిగాయి. - న్యూస్‌టుడే, దగదర్తి




### ఆలయాలకు పండగ శోభ



దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబవుతున్నాయి. ఈనెల 3 నుంచి 12వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పూజారులు తెలిపారు. సీతారామపురంలో గురువారం కలశ స్థాపనతో ప్రారంభమవుతాయని ఆర్యవైశ్య సంఘం నాయకులు తెలిపారు. సిద్ధేశ్వరంలో రోజుకో అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నట్లు పూజారులు సిద్ధయ్య, కాశయ్య తెలిపారు. - న్యూస్‌టుడే, సీతారామపురం

## వరద బాధితులకు రూ. 1.20 లక్షల అందజేత



ఎమ్మెల్యే సురేష్‌కు చెక్ అందిస్తున్న అపస్మా ప్రతినిధులు

**వింజమూరు, న్యూస్‌టుడే :** స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం ఉదయగిరి నియోజకవర్గ అపస్మా (ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్) ఉదయగిరి నియోజకవర్గ ప్రతినిధులు వరద బాధితులకు రూ. 1.20 లక్షల చెక్‌ను ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు అందజేశారు. **ఉదయగిరి :** మండలంలోని పుల్లాయపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో చదివే విద్యార్థులు రూ. 5,267 విరాళాలు సేకరించారు. ఆ నగదును పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.సుబ్బారెడ్డికి అందజేశారు. విద్యార్థులు సేకరించిన నగదుతోపాటు ఉపాధ్యాయులు కొంత జోడించి రూ. 10 వేలు సీఎం సహాయనిధికి జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో బోరబండ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఖాదర్‌బాషా, ఉపాధ్యాయినులు ఆదిలక్ష్మి, ప్రశాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

## 'రాళ్లపాడు' అభివృద్ధికి నిధులు అవసరం



ప్రాజెక్టు అధికారులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివి శివరామ్

**లింగసముద్రం, న్యూస్‌టుడే:** రాళ్లపాడు జలాశయం అభివృద్ధికి నిధుల విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతామని మాజీ ఎమ్మెల్యే దివి శివరామ్ అన్నారు. మంగళవారం రాళ్లపాడు ప్రాజెక్టు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందుకూరు, ఉదయగిరి ఎమ్మెల్యేలతోపాటు ఎమ్మెల్సీల సహకారంతో రాజకీయ నాయకులు, రైతులను కలుపుకొని ప్రాజెక్టు సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రాజెక్టులోని నీటిని ఎటువంటి హానికర పదార్థాలు కలపకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు దామా అంకయ్య, రాళ్లపాడు పరిరక్షణ కమిటీ అధ్యక్షులు మాధవరావు, రైతులు పాల్గొన్నారు,

## 6న రౌండ్‌టేబుల్ సమావేశం

**కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే:** ఈ నెల 6న ఐఎఫ్‌టీయూ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం రౌండ్‌టేబుల్ సమావేశానికి సంబంధించిన గోడపత్రికను నాయకులు ఆవిష్కరించారు. పెట్టుబడిదారి సంపన్నులను ప్రోత్సహించేందుకు ఆర్‌ఎస్‌ఎస్ కులగణనను వ్యతిరేకిస్తోందన్నారు. బాలుర ఉన్నత పాఠశాలలో జరిగే రౌండ్‌టేబుల్ సమావేశానికి అన్నిపక్షాల నాయకులు హాజరవాలని కోరారు. నాయకులు ఆర్.మోహన్, సాగర్, హరిబాబు, నాగేశ్వరరావు, జాన్, శివ పాల్గొన్నారు.



గోడప్రతులు ఆవిష్కరిస్తున్న నాయకులు

## సంప్రదాయ కళల పరిరక్షణే ధ్యేయం

**కావలి, న్యూస్‌టుడే:** సంప్రదాయ కళలను పరిరక్షించడానికి కృషి చేస్తున్నట్లు సద్భావన, సాధన ఆధ్యాత్మిక, సాంస్కృతిక చైతన్య సంస్థ జిల్లా అధ్యక్షులు గణపతిరాజు మారుతీరామారావు తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 5న ఉదయం తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనాలాపన పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముసునూరు హనుమత్ క్షేత్రంలో జరుగుతాయన్నారు.

### విద్యార్థులకు పళ్లాలు, నీళ్లసీసాలు అందజేత

**కందుకూరు గ్రామీణం :** మండలంలోని మాల్యాద్రికాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మేక్ ఏ ఛైంజ్ సొసైటీ ఆధ్వర్యంలో పళ్లాలు, వాటర్‌బాటిల్స్, రాతపుస్తకాలను పంపిణీ చేశారు. సొసైటీ నిర్వాహకులు పి.గౌతమ్ శివతేజ, వారి మిత్రులు కలిసి నిర్వహించారు. డాక్టర్ రవ్వా శ్రీనివాసులు, చెక్కా కేశవులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు ఆరుగురి ఎంపిక

**ఉలవపాడు :** రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-19 పోటీలకు ఆరుగురు విద్యార్థినులు ఎంపికయినట్లు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు తెలిపారు. సోమవారం సింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన వాలీబాల్, కబడ్డీ, టెన్నికాయిట్ క్రీడల్లో వి.భారతి, వి.మేఘన, కె.సుష్మ, కె.నిరీష, వి.రోహిణి, బి.నందిని ప్రతిభ కనబరిచారు. ఎంపికయిన విద్యార్థులను పీడీ శ్రీనివాసులు, అభినందించారు.

### ప్లాస్టిక్ నివారణతో పరిశుభ్రత

**లింగసముద్రం :** ప్లాస్టిక్ నివారణతో గ్రామాల్లో పరిశుభ్రత సాధ్యమని ఫఢ్స్ డైరెక్టర్ పి.వి.రమణయ్య అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలల్లో మంగళవారం ఎస్‌డీపీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు మాధవరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### గాంధీ జీవితం ఆదర్శనీయం

**వలేటివారిపాలెం :** మహాత్మాగాంధీ జీవితం ఆదర్శనీయమని ఐసీడీఎస్ సీడీపీవో శర్మిష్ఠ అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని పోలినేనిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ముందస్తు జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. గాంధీ వేషధారణలతో చిన్నారులు అలరించారు. కార్యక్రమంలో మండల పర్యవేక్షకురాలు సునీత, ఎంఈవో-2 మల్లికార్జునరావు, హెచ్ఎం సామ్యూల్, కార్యకర్తలు అరుణ, కృష్ణకుమారి పాల్గొన్నారు.

**దగదర్తి :** మండలంలోని నారాయణపురం (దక్షిణమిట్ట) ప్రాథమిక పాఠశాలలో ముందస్తు గాంధీ జయంతి వేడుకలు ప్రధానోపాధ్యాయుడు చెన్నయ్య ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిగాయి. గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలతో విద్యార్థులు అలరించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులందించారు. మిఠాయిలు పంచారు. విద్యా కమిటీ ఛైర్మన్ గోవర్ధన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

### సాంకేతిక పద్ధతులతో అధిక దిగుబడులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ చెన్నారెడ్డి

**సీతారామపురం:** రైతులు సాగులో సాంకేతిక పద్ధతులను ఆచరిస్తే దిగుబడులు పెరుగుతాయని ఉదయగిరి ఇన్‌ఛార్జి ఏడీఏ, సీతారామపురం ఏవో చెన్నారెడ్డి సూచించారు. మండలంలోని మారంరెడ్డిపల్లి, గుండుపల్లిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి, కంది పంటలను పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో వీఏఏ లక్ష్మీనారాయణ, వీఏ మాలాశ్రీ, మార్కెటింగ్ శాఖ సిబ్బంది యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థుల్లో నైతిక విలువలు తప్పనిసరి

**కలిగిరి :** విద్యార్థులకు చదువుతో పాటు మంచి ప్రవర్తన, నైతిక విలువలు ఉండాలని, అప్పుడే అన్నిరంగాల్లోనూ రాణించగలరని ఎస్సై ఉమాశంకర్ పేర్కొన్నారు. స్థానిక జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు చెకుముకి పోటీలు

**కావలి, కందుకూరు, ఉదయగిరి :** జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయిలో మంళవారం విద్యార్థులకు చెకుముకి పోటీలు నిర్వహించారు. కావలి, కందుకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో ఏర్పాటుచేసి విజేతలకు బహుమతులు అందజేశారు. సంస్థ నాయకులు పాల్గొన్నారు.

### విద్యుత్తు వినియోగదారులకు మెరుగైన సేవలు

**కందుకూరుపట్టణం :** విద్యుత్తు వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తామని కందుకూరు సబ్‌డివిజన్ ఏపీసీపీడీసీఎల్ ఈఈ మల్లెల నాగేశ్వరరావు తెలిపారు. ఒంగోలులో మీటర్ ప్రొటెక్షన్ ఈఈగా పనిచేస్తున్న ఆయన బదిలీపై కందుకూరు వచ్చారు. మంగళవారం పట్టణంలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. డీఈలు, ఏఈలు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

### తహసీల్దారుగా హేమంత్‌కుమార్ బాధ్యతలు స్వీకరణ

**వరికుంటపాడు, న్యూస్‌టుడే:** మండల తహసీల్దారుగా పసుపులేటి హేమంత్‌కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీల్లో జలదంకి నుంచి వచ్చారు. ఇక్కడ తహసీల్దారుగా ఉన్న మహమ్మద్ హుస్సేన్ కలెక్టరేట్‌కు వెళ్లారు. మండల పరిషత్తు కార్యాలయంలో ఈవోపీఆర్డీగా నాగూర్‌వలి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన కోవూరు నుంచి ఇక్కడికి వచ్చారు.

### 'అసత్య ఆరోపణలు తగదు'

**జలదంకి :** గ్రామంలోని పీహెచ్‌సీ వైద్య సిబ్బందిపై కొందరు అసత్య ఆరోపణలు చేయడం తగదని పీహెచ్‌సీ వైద్యాధికారి ఎ.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆసుపత్రిలో సిబ్బందితో కలిసి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన పలువురు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని మాపై తప్పుడు ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. సమావేశంలో సీహెచ్‌వో సోమేశ్వరరావు, సిబ్బంది ఎన్.హరి ప్రసాద్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

### విద్యార్థులు కథల పుస్తకాలు చదవాలి

**ఉదయగిరి :** సెలవుల్లో విద్యార్థులు ఇంటి వద్ద ఉపాధ్యాయులు ఇచ్చిన కథల పుస్తకాలు చదవాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని బీసీ కాలనీ తెలుగు పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు.

## 5 రోజుల్లో బిల్లుల పరిష్కారం: ఖజానాధికారి



దస్త్రాలు తనిఖీ చేస్తున్న జిల్లా ఖజానాధికారి గంగాద్రి

**ఉదయగిరి :** కార్యాలయానికి వచ్చిన బిల్లులు అయిదు రోజుల్లోపు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఖజానాధికారి డి.గంగాద్రి తెలిపారు. స్థానిక ఉప ఖజానా కార్యాలయాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యాలయాలకు వచ్చే పింఛనుదారులు, ఉద్యోగులకు ఏ సమస్య లేకుండా చూస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపఖజానాధికారి మమత, సీనియర్ అకౌంటెంట్లు బి.శ్రీహరి, కిషోర్ సభ్యులు పాల్గొన్నారు.

### మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు: 70939 81624, ఉదయగిరి : 80085 73944

**సమస్య :** పట్టణంలోని సుల్తాన్ మోహిద్దీన్ నగర్‌లో వారం నుంచి వీధిదీపాలు వెలగడం లేదు. **- ఖాదర్‌బాషా, స్థానికుడు.**

**సమాధానం :** సిబ్బందిని పంపి వీధిదీపాల సమస్య పరిష్కరిస్తాం. **- జి.లోకేశ్, మున్సిపల్ ఏఈ. - న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం**

? రామ్మూర్తిపేట, తదితర ప్రాంతాలకు వచ్చే తాగునీరు కొన్నాళ్లుగా కలుషితమవుతోంది.
**- పుల్లాల శ్రీకాంత్‌రెడ్డి, పుల్లారెడ్డినగర్**

✓ తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. **- సాయిరాం, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు -న్యూస్‌టుడే, కావలి**

## చివరి ఆయకట్టుకు నీరందేనా?



దెబ్బతిన్న వెంకంపేట బ్రాంచి కాలువ లైనింగ్ గోడలు

న్యూస్‌టుడే, లింగసముద్రం, కందుకూరు

సోమశిల జలాశయం నుంచి రాళ్లపాడు ప్రాజెక్టుకు వారంలో సాగునీరు రానున్నది. వర్షాల సీజన్ మొదలైంది. జలాశయం పరిధిలో పంటల సాగు ప్రారంభిస్తే ఆయకట్టు చివరి భూములకు నీరు సక్రమంగా చేరుతుందా? లేదా? అనే అనుమానాలు అన్నదాతల్లో వ్యక్తమవుతున్నాయి. అందుకు కారణం కాలువలు ఆధునికీకరించక, శిథిలావస్థకు చేరడమే. ఈ ఏడాదైనా పంట సాగు నాటికి దెబ్బతిన్న కాలువలకు మరమ్మతులు చేస్తారా? లేదా? అనే ప్రశ్న తలెత్తుతోంది.

రాళ్లపాడు జలాశయం కుడి కాలువ పరిధిలో అధికారికంగా 13,500, ఎడమ కాలువ పరిధిలో 1500 ఎకరాలు వెరసి 16వేల ఎకరాలు సాగులో ఉంది. కొన్నేళ్లుగా బ్రాంచి కాలువను ఆధునికీకరించకపోవడం చివరి ఆయకట్టుకు సాగునీరు అందడం గగనంగా మారింది. దీంతో పంట చివరి దశలో రైతులు అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి.

**15ఏళ్ల నుంచి ముందుకు సాగని ఎడమ కాలువ పనులు**

ఎడమ కాలువ అభివృద్ధి పనులు 15 ఏళ్ల నుంచి ముందుకు సాగడం లేదు. చీమలపెంట, గంగపాలెం బ్రాంచి కాలువల షట్టరు దిమ్మెలు మరమ్మతులు గురయ్యాయి. అధికారులు స్పందించి పంటలు సాగు నాటికి కాలువకు మరమ్మతులు చేపట్టి, చివరి ఆయకట్టు భూములకు సాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు.



కాలువ పరిధిలో మరమ్మతులకు గురైన షట్టరు

**అధ్వానంగా వెంకంపేట బ్రాంచి కాలువ**

వెంకంపేట బ్రాంచి కాలువ అధ్వానంగా మారింది. కాలువ చాలా ప్రాంతాల్లో లైనింగ్ గోడలు దెబ్బతిన్నాయి. దీంతో కాలువ చివరి వరకు సాగునీరు పారుదల చాలా కష్టంగా ఉంది. దీంతో కాలువ పరిధిలో సాగు చేసిన పంట చేతికందని పరిస్థితి.

**మరమ్మతులకు గురైన షట్టర్లు**

కాలువ పరిధిలో అక్కడక్కడ ఏర్పాటు చేసిన షట్టర్లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో సాగునీరు వృథాగాక తప్పడం లేదు.


**ప్రతిపాదనలు పంపాం: చంద్రమౌళి, జేఈ, రాళ్లపాడు జలాశయం**

కుడి, ఎడ కాలువలకు మరమ్మతులకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేసి, ప్రభుత్వ అనుమతి కోసం నివేదించాం. నిధులు విడుదలకు సంబంధించిన ఉత్తర్వులు రాగానే పనులు ప్రారంభిస్తాం. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం.

## వాహనం ఢీకొని ఎలక్ట్రీషియన్ దుర్మరణం

**కావలి, న్యూస్‌టుడే:** రోడ్డు ప్రమాదంలో ఎలక్ట్రీషియన్ మృతి చెందిన ఘటన ఇది. బుడంగుంట కాలనీలో నివసించే కె.నారాయణరెడ్డి (55) విద్యుత్తు పనులు చేస్తుంటారు. మంగళవారం తెల్లవారుజామున పట్టణం నుంచి వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. అతను అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఆవు దాడిలో గాయపడిన వృద్ధుడి మృతి



ఫకృద్దీన్

**సీతారామపురం, న్యూస్‌టుడే :** ఆవు దాడిలో గాయపడిన వ్యక్తి మృతి చెందిన సంఘటన సీతారామపురంలో చోటుచేసుకుంది. గత నెల 19న ఆవు దాడిలో గాయాలైన ఫకృద్దీన్ (81) ఆత్మకూరులో చికిత్స చేయించినా కోలుకోలేదు. సోమవారం రాత్రి అస్వస్థతకు గురయ్యారు. ఆసుపత్రికి తీసుకెళ్లేలోగా మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు

కోవూరు
• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

## అభివృద్ధి, సంక్షేమానికే ప్రాధాన్యం

**బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు:** కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికే ప్రాధాన్యమిస్తోందని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. బుచ్చి మండలం పల్లెపాడులో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితో కలిసి ఎన్టీఆర్ భరోసా పింఛనును మంగళవారం పంపిణీ చేశారు. ఎంపీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ద్వారా కేంద్రం నుంచి మరిన్ని నిధులు మంజూరు చేయించి గ్రామాలలో వసతులు కల్పిస్తామన్నారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ గత ఎమ్మెల్యే తన పాడేల ద్వారా ఇసుక, గ్రావెల్ దందాలు చేయించారని ఆరోపించారు. ఖాజానగర్ అల్‌అమీన్ మసీదు ప్రాంగణంలో నిర్మించిన గృహసముదాయాన్ని ప్రారంభించారు. అన్ని గ్రామాల్లో వైకుంఠదామాలు అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ప్రశాంతిరెడ్డి తెలిపారు. కోవూరులోని మైదిలి హాల్ వీధిలో వైకుంఠదామం వద్ద జరిగిన అభివృద్ధి పనులను వేమిరెడ్డి దంపతులు ప్రారంభించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు పాల్గొన్నారు.

## 4న పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా

**ఆత్మకూరు:** స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో 4న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ అభ్యర్థులు ఒరిజినల్స్‌తో పాటు జిరాక్స్ కాపీలతో హాజరు కావాలన్నారు.

## గట్టు ఆక్రమించారని ఫిర్యాదు

**సంగం:** సంగం ఎత్తిపోతల పథకం నుంచి తలుపూరుపాడు పొలాలకు సాగునీటిని సరఫరా చేసే కాలువను ఆక్రమించిన కబ్జాదారుడు తమను ఇబ్బందులకు గురి చేస్తున్నాడంటూ కొలిమెట్ల గ్రామవాసి వి.బాలమీరయ్య అలియాస్ బెట్టులినాయుడు మంగళవారం తహసీల్దారు సోమ్లానాయక్‌కు ఫిర్యాదు చేశారు. రెండున్నర ఎకరాల మేర కాలువ గట్టుని ఆక్రమించి.. కంచె వేయడంతో తాము పొలాల వద్దకు వెళ్లలేకపోతున్నామని వివరించారు. చర్యలు తీసుకుంటామని తహసీల్దారు చెప్పారు.

### మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు : 80085 73987, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

**సమస్య:** మర్రిపాడు మండలంలోని రాంపల్లిలో కుళాయి పైపులైన్ పగిలి నీరు వృథావుతోంది. – అశోక్, స్థానికుడు

? రాజులపాడు సచివాలయం వద్ద మురుగునీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. – కొండయ్య, స్థానికుడు

**సమాధానం:** సమస్యలు పరిష్కరించమని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు తెలియజేస్తాం. – నాగమణి, ఎంపీడీవో

? మర్రిపాడు మండలం పి.ఎస్.పల్లి రోడ్డులో విద్యుత్తు స్తంభానికి మొక్కలు అల్లుకొని.. అంతరాయం ఏర్పడుతోంది. –రవి, స్థానికుడు

✔ తీగజాతి మొక్కలు తొలగిస్తాం. – వెంకటేశ్, లైన్‌మెన్

## క్రీడల్లో విద్యార్థుల సత్తా

**సంగం, ఆత్మకూరు, న్యూస్‌టుడే:** సంగం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్.సాయిగణేశ్ 14 ఏళ్ల లోపు విభాగంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు పి.బుజ్జయ్య మంగళవారం తెలిపారు. జిల్లా జట్టులో స్థానం పొందిన గణేశ్ త్వరలో రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరవుతారన్నారు. ఆత్మకూరు బట్టేపాడుకు చెందిన విద్యార్థినులు రాణి, హసీనా అండర్-17, అండర్-14 విభాగం కబడ్డీలో ప్రతిభ చూపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

# ప్రాణాలు పోతున్నా.. నిర్లక్ష్యమేనా..!

● పొదలకూరు మండల పరిధిలోని సూరాయపాళెం గ్రామ సమీపంలో విద్యుత్తు నియంత్రిక వద్ద సరఫరా సరిగా లేదు. పరిశీలించేందుకు వెళ్లిన ప్రసాద్ అనే యువకుడు అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయారు.

● వెంకటాచలం, బుచ్చి, ఇందుకూరుపేట, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు, కోవూరు మండలాల్లో పలు చోట్ల ఇలాంటి ఘటనలు జరిగాయి. చిన్నపాటి విద్యుత్తు సమస్యల్లో పలువురు మృతిచెందారు. ఎక్కడో ఒక చోట ప్రమాదాలతో పలువురు బలవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

న్యూస్‌టుడే, పొదలకూరు

విద్యుత్తు సరఫరాలో ఏర్పడిన అవాంతరాలను గుర్తించి ఎప్పటికప్పుడు సరిచేసేందుకు రెండు, మూడు గ్రామాలకు కలిపి హెల్పర్లు ఉండేవారు. ప్రస్తుతం వ్యవసాయ, గృహావసరాల కనెక్షన్లు గణనీయంగా పెరిగాయి. సరఫరా నిత్యం పర్యవేక్షించాల్సిన సిబ్బంది లేకపోవడంతో కొన్ని రోజుల పాటు సమస్య అలాగే ఉంటోంది. ఈ క్రమంలో రైతులు, వినియోగదారులు మరమ్మతులు చేసేందుకు ప్రయత్నించి ప్రాణాలు కోల్పోతున్నారు. పొదలకూరు ట్రాన్స్‌కో సబ్ డివిజన్ పరిధిలోని పొదలకూరు, విరువూరు, మనుబోలు విద్యుత్తు ఉపకేంద్రాల్లో 52 మంది లైన్‌మెన్లు, జూనియర్ లైన్‌మెన్లు విధులు నిర్వహించాల్సి ఉండగా ప్రస్తుతం 22 చోట్ల ఎవరినీ నియమించలేదు. జూనియర్ లైన్‌మెన్ల భర్తీ చేపట్టకపోవడం, సిబ్బంది కొందరు పదోన్నతులు పొందగా ఖాళీలు భర్తీ చేయలేదు. అసిస్టెంటు లైన్‌మెన్లుగా వెళ్లడంతో క్షేత్రస్థాయిలో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. పొదలకూరులో నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గ్రేడ్-2 లైన్‌మెన్లు రెండు చోట్ల ఖాళీగా ఉన్నాయి. విరువూరు పరిధిలో నాలుగు ఏఎల్ఎంలు, మనుబోలులో 11 ఏఎల్ఎంలు, ఒక జూనియర్


విద్యుదాఘాతంతో మృతి చెందిన ప్రసాద్ (పాతచిత్రం)

లైన్‌మెన్ పోస్టుల్లో సిబ్బంది లేరు. కొన్ని నెలలుగా విద్యుత్తు నియంత్రికల చోరీలు ఎక్కువగా జరుగుతుండటంతో అన్నదాతలు సతమతమవుతున్నారు. అక్కడ నియంత్రిక ఏర్పాటు చేయాలంటే డిస్కం అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

● పొదలకూరు ఏడీఈ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో కొరతగా ఉన్న జేఎల్ఎం, ఏఎల్ఎం లను త్వరలో భర్తీ చేస్తామన్నారు. సబ్‌డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 28 విద్యుత్తు నియంత్రికలు చోరీ గురయ్యాయని, అందులో రాగితీగను అపహరిస్తున్నారన్నారు. నూతన నియంత్రికకు సుమారు 2.50 లక్షలు ఖర్చవుతోందన్నారు. కొత్త నియంత్రికను ఏర్పాటు చేయాలంటే ఎఫ్ఐఆర్ అవసరమన్నారు. దర్యాప్తులో జాప్యం జరుగుతోందని, రైతులకు ఇబ్బందులు లేకుండా అందిస్తామన్నారు.

## చోరీలతో రైతుల బెంబేలు

**సంగం, న్యూస్‌టుడే:** మండలంలో రైతులను దొంగలు వేధిస్తున్నారు. పెన్నానది తీర ప్రాంతంలో వివిధ పంటలను సాగు చేస్తున్న రైతులు వ్యవసాయ పంపుసెట్ల ద్వారా సాగునీటి సరఫరా పొందుతున్నారు. వాటికి విద్యుత్తు సరఫరా చేసే రాగి తీగలు స్విచ్‌బోర్డు నుంచి అనుసంధానమై ఉంటాయి. వాటిని దొంగలు కత్తిరించి అపహరిస్తున్నారు. ఫలితంగా పంపుసెట్లు పని చేయడం లేదు. పడమటిపాళెం, సంగం గ్రామాల్లో గత రెండు రోజులుగా సుమారు 25 చోరీలు జరిగాయి. మిగిలిన గ్రామాల్లోనూ వరుసగా జరిగాయి. పోలీసులు తగు చర్యలు చేపట్టి తమను ఆదుకోవాలని రైతులు కోరారు. ఈ మేరకు మంగళవారం సంగం పోలీసులకు ఫిర్యాదు చేశామని వారు తెలిపారు.

# విజేతలకు బహుమతుల ప్రదానం

**కోవూరు, పొదలకూరు, తోటపల్లిగూడూరు, మనుబోలు, సంగం, న్యూస్‌టుడే:** విద్యార్థులు చిన్నప్పటి నుంచే ప్రశ్నించడం అలవరచుకోవాలని జనవిజ్ఞానవేదిక జిల్లా నాయకులు మాదాల రాము తెలిపారు. జేవీవీ సైన్సు సంబరాల్లో భాగంగా పట్టణంలోని కాపువీధిలోని శాఖా గ్రంథాలయంలో మండల స్థాయిలో చెకుముకి ప్రతిభ పరీక్ష నిర్వహించారు. మండలంలోని 14 ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలకు చెందిన 42 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పొదలకూరులో విద్యార్థులకు చెకుముకి ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. వీరిలో ప్రతిభ చూపిన వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశామని నిర్వాహకులు వెంకటేశ్వర్లు, బి.వి.కల్యాణ్ తెలిపారు. తోటపల్లిగూడూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌భాస్కరరావు పాల్గొని పరీక్షలు పర్యవేక్షించారు. విజ్ఞజోషిక, పూజిత, సాయిరిషిక విజేతలుగా నిలవడంతో 25న జరిగే జిల్లాస్థాయి పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు రియాజ్ వారిని అభినందించారు. సంగం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన చెకుముకి పోటీల్లో మండల స్థాయిలో సంగం విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. ఆత్మకూరులో విజేతలకు డాక్టర్ షకీలా నగదు బహుమతులు అందజేశారు. చేజర్లలో జరిగిన పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చూపారు.


కోవూరులో ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

**పొదలకూరు, న్యూస్‌టుడే:** స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో శిథిలమైన పారిశుద్ధ్య వాహనానికి ఉపాధిహామీ సిబ్బంది రంగులు దిద్ది సుందరంగా తీర్చి దిద్దారు. ఎంపీడీవో నగేశ్‌కుమారి మాట్లాడుతూ మొక్కలను ఉచితంగా తీసుకోవచ్చన్నారు. మొక్కలను ఇనుకుర్తి సామాజిక అటవీ వనం నుంచి సేకరించామన్నారు.

# బైక్‌పై సరదాగా వెళ్లి.. తిరిగిరాని లోకాలకు

**చేజర్ల, న్యూస్‌టుడే:** తమిళనాడులోని మదురైలో బైక్‌పై సరదాగా వెళ్లిన విద్యార్థి జారిపడి.. విగతజీవిగా మారి.. కన్నవారిని శోకసంద్రంలో ముంచాడు. మండలంలోని బోడిపాడుకు చెందిన నాగిరెడ్డి చెంచురామిరెడ్డి ప్రయివేటు సంస్థలో చిరుద్యోగి. పిల్లల్ని చదివించుకునేందుకు ఆయన గత కొన్నేళ్లుగా ఆత్మకూరులో నివాసం ఉంటున్నారు. ఇతని పెద్ద కుమారుడు చందు మదురైలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం విద్యార్థి. సోమవారం సాయంత్రం ఇతను సహచరులతో కలిసి బైక్‌పై వెళ్తూ.. ఓ మలుపు వద్ద కారును అధిగమించే క్రమంలో వెనుక కూర్చున్న చందు కిందపడిపోయాడు. తలకు తీవ్రగాయాలవడంతో సహచర విద్యార్థులు వెంటనే స్థానిక ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటికే చందు చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎంతో కష్టపడి చదివించుకొంటున్న తమ బిడ్డ మరో ఏడాదిలో స్థిరపడతాడని ఆశించిన కుటుంబ సభ్యులు పిడుగులాంటి వార్త విని హతాశులయ్యారు.

## ఎట్టకేలకు చెత్త తొలగించారు




గుమ్మళ్లదిబ్బలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద పేరుకుపోయిన చెత్తను పంచాయతీ కార్యదర్శి శివకుమార్ ఆదేశాలతో పారిశుద్ధ్య సిబ్బంది ఆదివారం తొలగించారు. దుర్వాసన రాకుండా బ్లీచింగ్ చల్లించారు. 'ఈనాడు'లో 'దుర్వాసనతో సతమతం' శీర్షికతో కథనం ప్రచురితమైంది. పంచాయతీ కార్యదర్శి స్పందించి చర్యలు తీసుకోవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.– న్యూస్‌టుడే, కోవూరు



## రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలకు పల్లిపాడు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మయ్య తెలిపారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి క్రీడామైదానంలో జరిగిన అండర్-14 బాలికల విభాగంలో, అండర్-17 విభాగంలో పలువురు ఎంపికయ్యారని తెలిపారు. ఎస్‌జీఎఫ్ అండర్-14, అండర్-17 బాలబాలికల సెపక్‌తక్రా పోటీల్లో ఇందుకూరుపేట జడ్పీ విద్యార్థులు ప్రతిభ చూపారని ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్ పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, ఇందుకూరుపేట

## మరుగున పడేశారు!



మర్రిపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాడు-నేడులో భాగంగా ఏడాది కిందట రూ.15 లక్షల వ్యయంతో రెండు మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. మొదట రూ.6లక్షల నిధులు విడుదల కావడంతో పనులు ప్రారంభించారు. తరువాత నిధుల విడుదలలో జాప్యం కారణంగా నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు గురవుతున్నారు. మల, మూత్ర విసర్జనకు ఆరుబయటకు వెళ్తున్నామని విద్యార్థినులు వాపోయారు. నిధులు విడుదలైతే పనులు పూర్తి చేస్తామని కళాశాల ప్రిన్సిపల్ శివప్రవీణ్ తెలిపారు. – న్యూస్‌టుడే, మర్రిపాడు(ఆత్మకూరు గ్రామీణం)

## పరిసరాల పరిశుభ్రత పాటిద్దాం

మండలంలోని తెలుగురాయపురంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవ అవగాహన ర్యాలీ నిర్వహించారు. మహాత్మాగాంధీ జయంతి వేడుకల నేపథ్యంలో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సిబ్బంది, చిన్నారులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కలువాయి




## మహాత్ముని బాటలో నడుద్దాం



జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా విడవలూరులోని పీఆర్ఆర్ అండ్ వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ సుజాత మంగళవారం మహాత్ముని చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆత్మకూరు పట్టణంలోని ఎల్ఆర్‌పల్లి-1 అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారికి గాంధీ వేషం వేసి.. మహాత్ముని జీవిత విశేషాలు వివరించారు. గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు..

– న్యూస్‌టుడే, విడవలూరు, ఆత్మకూరు

## వృద్ధురాలికి న్యాయం చేయండి

**తోటపల్లిగూడూరు, మనుబోలు:** మండలంలోని సౌత్‌ఆములూరు మిక్స్‌డ్‌కాలనీకి చెందిన మొగిలిగుంట శేషమ్మ అనే వృద్ధురాలిపై దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు షాన్‌వాజ్ డిమాండ్ చేశారు. ఆమెను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి ఫిర్యాదు చేశారు. గ్రామస్థుడు ప్రసాద్ ఆమెను అసభ్య పదజాలంతో దూషించి దాడి చేశారన్నారు. బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు.

## బుచ్చిలో రక్తదానం

**బుచ్చి:** నగర పంచాయతీలోని ప్రైవేట్ మందిరంలో నేషనల్ బ్లడ్ డొనేషన్ డే సందర్భంగా లయన్స్‌క్లబ్, ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం జరిగింది. పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, సభ్యులు మస్తాన్‌బాబు, వెంకటనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## లడ్డూ కల్తీ హేయమైన చర్య

**ఇందుకూరుపేట:** తిరుమల లడ్డూ కల్తీ చేయడం హేయమైన చర్య అని భాజపా జిల్లా నాయకులు కె.శ్రీనివాసులురెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ హిందూ సంప్రదాయాలకు అత్యంత పవిత్రమైన తిరుమల క్షేత్రంలో ఈ ఘటన చోటుచేసుకోవడం బాధాకరమన్నారు.

## పరిశోధన పత్రం సమర్పణ

**కొడవలూరు:** శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో పీజీ విద్యార్థులు డీప్ లెర్నింగ్‌పై పరిశోధన పత్రాన్ని సమర్పించారు. ఎంసీఏ విద్యార్థులు ఉమర్, తేజ, సాయి.. డీప్ లెర్నింగ్ మెథడ్స్ అండ్ అప్లికేషన్స్‌పై పరిశోధన చేశారు.

# అసంపూర్తి గృహాలు.. లబ్ధిదారుల అవస్థలు

గ్రామీణ ప్రాంతాల్లో సొంతిల్లు లేనివారికి స్థలాలిస్తున్నాం.. పక్కా గృహాలు నిర్మిస్తామని గత వైకాపా ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు తరచూ సమావేశాల్లో చేసిన వాఖ్యలివి... లబ్ధిదారులు నిర్మించుకోకుంటే ప్రభుత్వమే నిర్మించి ఇస్తుందని ఎన్నో కల్లబొల్లి మాటలు చెప్పారు.. కొన్ని చోట్ల గుత్తేదారులకు కట్టబెట్టారు... అయినా ఎక్కడా పూర్తికాలేదని పలువురు వాపోతున్నారు. – న్యూస్‌టుడే, సైదాపురం, కలువాయి, రాపూరు, తోటపల్లిగూడూరు


### వివిధ దశల్లో నిలిచిన పనులు

కలువాయి మండలంలో 31 లేఅవుట్లలో 888 గృహాలు మంజూరయ్యాయి. గుత్తేదారులు వివిధ దశల్లో గృహాలు నిర్మించి ప్రభుత్వం మారగానే వదిలేశారు. ఇప్పటి వరకు మండలంలో వివిధ దశల్లో ఉన్న గృహాలకు రూ.4.57 కోట్లు, ఉపాధి హామీ కింద రూ.32 లక్షలు నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. కలువాయి, నూకనపల్లి, తెలుగురాయపురం, వెంకటరెడ్డిపల్లి, కనుపూరుపల్లి, పెన్నబద్దెవోలు, బ్రాహ్మణపల్లి తదితర గ్రామాల్లోని లేఅవుట్లలో వివిధ దశల్లో గృహాలు నిలిచిపోయాయి. ఎక్కువ చోట్ల బెస్‌మట్టం లెవల్‌లోనే నిలిచిపోవడం గమనార్హం.


కలువాయిలో పునాదుల దశలోనే గృహాలు

### నాసిరకం నిర్మాణాలు..

సైదాపురం మండల పరిధిలో గత ప్రభుత్వ హయాంలో 729 మంది లబ్ధిదారులను గుర్తించి ఇళ్ల పట్టాలు అందజేశారు. గ్రామాల్లో 32 లేఅవుట్లు వేశారు. లబ్ధిదారులపై భారం పెరగడంతో నిర్మాణాలకు ముందుకు రాలేదు. ప్రభుత్వం గుత్తేదారులకు అప్పగించడంతో నాణ్యత నేతిబీరగా మారింది. తలుపూరు, నలబొట్లపల్లి, చాగణం, రాజుపాళెం, ఎర్రసంఘం, షామైన్ తదితర లేఅవుట్లలో గుత్తేదారులు చేసిన పనుల్లో పునాదులు కూడా సక్రమంగా వేయకుండానే ఇళ్ల నిర్మాణపు పనుల్ని చేపట్టారు. నాసికరంగా పనులు చేస్తుండటంతో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. గృహనిర్మాణ శాఖ ఏఈ భాస్కర్ మాట్లాడుతూ.. పక్కాగృహాలు మంజూరైన వారు గృహాలు నిర్మించుకోవాలన్నారు. వ్యక్తిగతంగా నిర్మించుకుంటున్న వారు నెలాఖరులో 150 మందికిపైగా గృహప్రవేశాలు చేస్తారన్నారు.


సైదాపురంలో...

### ఎక్కడ వేసిన గొంగళి అక్కడే

రాపూరు మండలంలో నిర్మాణాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. 20 లేవుట్లలో 1095 మంది లబ్ధిదారులకు గృహాలు కేటాయించారు. 504 మంది నిర్మాణం చేపట్టారు. తెగచెర్ల, సిద్ధవరం, రాపూరు, రావిగుంటపల్లి, గోనుపల్లి, బొజ్జనపల్లి, ఎంపీపురంలో 111 గృహాలకు గాను 14 మాత్రమే పూర్తయ్యాయి. 97 వివిధ దశల్లో ఉన్నాయి. మరో 15 పంచాయతీల్లో ఒక్క ఇల్లు నిర్మించకపోవడంతో చిట్టడవిని తలపిస్తున్నాయి. గృహనిర్మాణ శాఖ ఏఈ రామకృష్ణ మాట్లాడుతూ గృహాలు మంజూరైనవారు నిర్మాణం చేపట్టకుంటే రద్దుచేస్తామన్నారు.

## అర్బన్ పీహెచ్‌సీ ఎదుట ధర్నా

**ఆత్మకూరు, న్యూస్‌టుడే:** పట్టణంలోని అర్బన్ పీహెచ్‌సీ ఎదుట ఆశా వర్కర్లు ధర్నా చేశారు. మండలంలోని రావులకొల్లు ఆశా వర్కర్‌ను తొలగించడాన్ని నిరసిస్తూ మంగళవారం వీరు ఈ కార్యక్రమం చేపట్టారు. ఆశావర్కర్ పందిళ్లపల్లి విజయమ్మను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. సీఐటీయూ మండలశాఖ అధ్యక్షుడు నాగయ్య, కార్యదర్శి హజరత్తయ్య పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

**ఆత్మకూరు, న్యూస్‌టుడే:** పట్టణంలో ఇటీవల మృతి చెందిన నాలుగు కుటుంబాలకు మంగళవారం శ్రీసాంబశివా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ. 40వేల సాయం అందజేశారు. నలుగురు మృతిచెందగా వారి కుటుంబీకులను పరమార్శించి ఒక్కొక్కరికి రూ. 10వేల సాయం అందజేశారు. ప్రసాద్‌రెడ్డి, యానాదిరెడ్డి, నరసింహారెడ్డి, బాధితులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ పింఛన్ల పంపిణీ

**ఇందుకూరుపేట, న్యూస్‌టుడే:** అర్హులందరికీ పింఛన్లు పంపిణీ చేస్తున్నామని జడ్పీ డిప్యూటీ సీఈవో మోహన్‌రావు అన్నారు. జగదేవిపేట, డేవిస్‌పేట గ్రామాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని పర్యవేక్షించారు. ఎంపీడీవో నాగేంద్రబాబు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## మద్యం దుకాణాల బంద్

**అనంతసాగరం, న్యూస్‌టుడే:** సోమశిల, చిలకలమర్రి, అనంతసాగరం, రేవూరులో ప్రభుత్వ మద్యం దుకాణాలు మూసేశారు. ఈ దుకాణాల్లో పనిచేసే సిబ్బంది తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఉదయం నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు వీటిని తెరవలేదు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తపాలసీని 12 నుంచి అమలులోకి తీసుకురానున్న నేపథ్యంలో న్యాయ్యం చేయాలని వారు నిరసనకు దిగారు.



### వెంకటగిరి నియోజకవర్గ సమాచారం

## ఉపాధిహామీ పనుల పరిశీలన

**సైదాపురం, న్యూస్‌టుడే:** గ్రామాల్లోని పేదలందరికి ఉపాధిహామీ పథకం ద్వారా వివిధ రకాల పనులు కల్పిస్తున్నామని ఎంపీడీవో శివకుమార్ తెలిపారు. రామసాగరంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను మంగళవారం పరిశీలించారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## భవన నిర్మాణ కార్మికుల నిరసన

**సైదాపురం:** ఇసుక కొరతతో కార్మికులకు పనులు లేకుండా పోతున్నాయని జిల్లా రైతు కూలీ సంఘం అధ్యక్షులు పోలయ్య ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. డీటీ అనూరాధకు వినతి పత్రం అందించారు.

## ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడాలు

**రాపూరు:** మద్దెలమడుగు వద్ద శిథిలావస్థలో ఉన్న పురాతన భవనాన్ని ఇటీవల కొందరు కూల్చేశారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి రంగయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

## జొన్నవాడలో భక్తురాలిపై దాడి

**బుచ్చిరెడ్డిపాళెం,:** జొన్నవాడ మల్లికార్జునస్వామి కామాక్షితాయి ఆలయంలో భక్తురాలిపై దాడి జరిగింది. పోలీసుల వివరాల మేరకు..సంగం మండలం జెండాదిబ్బకు చెందిన వెంకటరమణమ్మ, తన కోడలితో కలిసి కామాక్షితాయిని సోమవారం దర్శించుకున్నారు. అమ్మవారి చీరల వేలం నిర్వహించగా అక్కడికి వెళ్లారు. అక్కడున్న వ్యాపారికి వారికి చీర విషయంలో వివాదం జరిగింది. ఆమెపై దాడిచేయడంతో వేలు విరిగింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

## మద్యం స్వాధీనం

**మనుబోలు, న్యూస్‌టుడే:** మండలంలోని మడమనూరులో అక్రమంగా నిర్వహిస్తున్న మద్యం గొలుసు దుకాణాలపై ఎస్సై రాకేశ్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దాడుల్లో పన్నెం నరసయ్య వద్ద 32, రామచంద్రయ్య వద్ద 48, కంద్రాతి సుధాకర్ 46, మహిళ వద్ద 25 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

**మర్రిపాడు, ఆత్మకూరు, న్యూస్‌టుడే:** ఆత్మకూరు మండలంలోని గండ్లవీడు బొగ్గేరు, మర్రిపాడు మండలంలోని భీమవరం బొగ్గేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు. ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు.

## రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**సైదాపురం, న్యూస్‌టుడే:** వ్యవసాయ, ఉద్యాన శాఖల ద్వారా రైతులకు అందించే వివిధ సేవలు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులు హైమావతి, ఆనంద్ సూచించారు. సైదాపురంలోని రైతు సేవా కేంద్రంలో మంగళవారం ఆయా శాఖల ఆధ్వర్యంలో రైతులకు అందించే వివిధ రకాల సేవలపై రైతులకు అవగాహన కల్పించారు.

## ఉద్యాన పంటల సాగుతో అధిక లాభాలు

**మనుబోలు, తోటపల్లిగూడూరు, బుచ్చి, కొడవలూరు, న్యూస్‌టుడే:** ఉద్యాన పంటల సాగుతో అధిక లాభాలు పొందవచ్చని వ్యవసాయశాఖ ఏడీ శివనాయక్ తెలిపారు. మనుబోలు మండలంలోని చెర్లోపల్లి, జట్లకొండూరు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో సాగు చేస్తున్న బంతి పూల తోటను పరిశీలించారు. తోటపల్లిగూడూరు మండలం వరిగొండలో రైతులకు అవగాహన కల్పించారు. పొదలకూరు మండలం నల్లపాలెం, ప్రభగిరిపట్నం గ్రామాల్లో ఉద్యాన, పశుసంవర్ధక, పట్టుపరిశ్రమ శాఖల అధికారులతో కలిసి పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఉద్యాన అధికారి ఆనంద్ మాట్లాడుతూ రైతులకు ప్యాక్ హౌస్, ఫారం పాండ్స్ పై రాయితీ పొందవచ్చన్నారు. పొలం పిలుస్తోంది. కార్యక్రమం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని ఏడీఏ సుజాత తెలిపారు. బుచ్చి మండలం రేబాలలో ఆమె మాట్లాడుతూ ఆక్వాసాగు చేసుకొనే వారు తప్పనిసరిగా లైసెన్సులు తీసుకోవాలన్నారు. వేరు సెనగ నూతన వంగడాలతో అధిక దిగుబడులు సాధించవచ్చని విడవలూరు మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య అన్నారు. ఊటుకూరు, పెద్దపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.


మనుబోలులో బంతిసాగును పరిశీలిస్తున్న అధికారులు

## డ్వామా పీడీకి నివేదిక


పీడీకి నివేదికతోపాటు పూల బొకె అందిస్తున్న ఏపీడీలు

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: జిల్లా పరిధిలో డ్వామా ఆధ్వర్యంలో ప్రస్తుతం జరుగుతున్న పనులు, మండలాల వారీగా పరిస్థితిని కొత్తగా బాధ్యతలు స్వీకరించిన డ్వామా పీడీ గంగా భవాని తెలుసుకున్నారు. ఇందుకు సంబంధించి ఏపీడీలు వారి పరిధిలో నియోజకవర్గాల వారీగా నివేదికను ఆమెకు మంగళవారం అందించారు. పూల మొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం శాఖాపరంగా ఉన్న పలు అంశాలను ఏపీడీ లక్ష్మీనారాయణ ఆమె దృష్టికి తీసుకెళ్లారు.

# నెల్లూరు

• నెల్లూరు • నెల్లూరు గ్రామీణం

## చెకుముకి పరీక్షల్లో ప్రతిభ


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు నగర స్థాయి చెకుముకి పరీక్ష నిర్వహించారు. ముఖ్యఅతిథి డాక్టర్ దయాకర్ మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ వైపు మొగ్గు చూపాలని తెలిపారు. జనవిజ్ఞాన వేదిక నాయకుడు డాక్టర్ శీనానాయక్ మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏటా పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. పోటీల్లో 400 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. మూడు బృందాలు జిల్లా స్థాయికి ఎంపికయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఎండీ రఫీ, దంత వైద్యురాలు లహరి తదితరులు పాల్గొన్నారు.

### మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

**సమస్య:** ఖుద్దూస్‌నగర్‌లో కాలువలు పూడికతో నిండిపోయాయి. మురుగునీరు నిలిచి దుర్గంధం వస్తోంది. – రెహనా

? సత్యనారాయణపురం, నేతాజీనగర్, ఎస్వీఆర్ హైస్కూల్ వద్ద కాలువల్లో మురుగు నీటి పారుదల లేక దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. – స్థానికులు

**సమాధానం:** కాలువల్లో పూడిక తీయిస్తాం. – డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి

? పత్తేఖాన్‌పేట రమేష్‌రెడ్డినగర్‌లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ప్రజలపై దాడులు చేస్తున్నాయి. – సుబ్బారావు

✓ కుక్కలను పట్టించేందుకు చర్యలు చేపడతాం. – డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి

## గృహ రుణాల మంజూరు వేగవంతం చేయండి


నగదు అందిస్తున్న కమిషనర్

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నెల్లూరు నగరపాలకసంస్థకు సంబంధించి గృహ లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా రుణాల మంజూరు వేగవంతం చేయాలని కమిషనర్ సూర్యతేజ సూచించారు. మంగళవారం కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మెప్మా సిబ్బంది, వివిధ బ్యాంకుల మేనేజర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేసి గృహాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అయిదుగురు లబ్ధిదారులకు రూ.35వేల చొప్పున మెప్మా ద్వారా మంజూరైన రుణ నగదును అందించారు. సమావేశంలో అదనపు కమిషనర్ నందన్, మెప్మా పీడీ రవీంద్ర, హౌసింగ్ పీడీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: రౌడీషీటరు ప్రణయ్‌పై ఈనెల 29న హత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో నిందితులను సంతపేట పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో ఆకాష్, పెంచలయ్య, సాయికుమార్, రాములు ఉన్నారని ఎస్సై బాలకృష్ణ అరెస్టు చేశారు.

# హరిత సంకల్పం

యువకులతో కలసి మొక్కల పెంపకం



న్యూస్‌టుడే, నెల్లూరు(దర్గామిట్ట)

ఆయన ఉద్యోగ బాధ్యతలతోపాటు సమాజానికి సేవ చేయాలని తలచారు. అందుకు మొక్కలు పెంచి వాయు కాలుష్యాన్ని నివారించాలనుకున్నారు. ప్రణవ హరిత దళం పేరుతో పది మంది యువకుల సహకారంతో రహదారుల వెంట మొక్కలు పెంచుతున్నారు. అంతే కాదు.. యోగాలో ఉచితంగా శిక్షణ ఇస్తూ స్ఫూర్తిగా నిలిచారు.. చంద్రశేఖర్.


మొక్క నాటుతున్న చంద్రశేఖర్

నెల్లూరుకి చెందిన వినుకొండ చంద్రశేఖర్ వ్యవసాయశాఖలో విస్తరణాధికారిగా పనిచేస్తున్నారు. ఆయన తండ్రి అంకయ్య పంట పొలాలు పెంపకం.. రహదారుల వెంట మొక్కలు నాటేవారు. ఆయన్ని స్ఫూర్తిగా తీసుకుని కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. 2016 నుంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకు 15 వేలకు పైగా మొక్కలు నాటించారు. పొదలకూరు, అల్లూరు, గుడిపల్లిపాడు, నవలాకుల గార్డెన్, ఇందుకూరుపేట తదితర గ్రామాల పరిధిలో ఇప్పటికి వరకు వివిధ రకాల మొక్కలు నాటించారు.

### జిల్లా అధికారుల సహకారం

జిల్లా అటవీ అధికారుల సహకారంతో వందలాది మొక్కలు తీసుకుని వాహనంలో తాను వెళ్లే మార్గంలో ఎక్కడ చెట్లు కనిపించవో అక్కడ నాటుతారు. నీళ్లు పోయకుండానే ప్రకృతిలో పెరిగే వాటినే ఎంచుకుంటారు. ఒక్కోసారి కూలీలకు డబ్బులు ఇచ్చి వారితో నాటిస్తున్నారు. కొత్తగా కొన్ని పాఠశాలలను ఎంపికచేసి అక్కడ ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులను హరితం వైపు అడుగులు వేయించే ప్రయత్నం మొదలు పెట్టారు. జిల్లా వ్యాప్తంగా పలు విద్యాసంస్థల్లో అయిదు వేల మొక్కలు నాటించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకున్నారు.

### యోగాలో శిక్షణ

ప్రధానంగా యోగా విద్యలో ఉన్నత కోర్సులు పూర్తి చేసి తరచూ ఉద్యోగులకు శిక్షణ ఇస్తున్నారు. నెల్లూరులో ఆయుధాలులో లేని యోగా కోర్సుల గురించి అవగాహన కల్పించడమే కాదు.. పార్లాండి సంస్థల తరఫున యోగాపై అవగాహన కల్పిస్తూ వివిధ సంస్థల నుంచి సత్కారాలు అందుకున్నారు.

### 5 వేల మొక్కలు ఒకేసారి నాటించేలా..

– చంద్రశేఖర్, నెల్లూరు వ్యవసాయ విస్తరణాధికారి

రాబోయే రోజుల్లో కాలుష్యం తీవ్రరూపం దాల్చుతుంది. పచ్చటి చెట్లు మనకు బాసటగా నిలుస్తాయి. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి. వారిలో చైతన్యం తెచ్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నా. ప్రతి ఆగస్టు 15వ తేదీ 5 వేల మొక్కలను ఒకేసారి నాటించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు.

## మూడు నుంచి ఏపీ టెట్ పరీక్షలు


అధికారులతో మాట్లాడుతున్న డీఆర్వో లవన్న

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ఈనెల 3 నుంచి 21వ తేదీ వరకు ఏపీటెట్ పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏర్పాట్లపై మంగళవారం కలెక్టరేట్‌లో డీఆర్వో ఎస్.లవన్న అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తాగునీరు, విద్యుత్తు సౌకర్యం, ఫ్యాన్లు, విద్యుద్దీపాలు, మరుగుదొడ్లు వంటి అన్ని వసతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతించవద్దని అధికారులకు సూచించారు. నెల్లూరు నగరంలోని ముత్తుకూరు రోడ్డులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, పొట్టేపాళెం సమీపంలోని అయాన్ డిజిటల్ జోన్, కావలి ఉదయగిరి రోడ్డులో గల విశ్వోదయ కళాశాల, కడలూరు ఆర్ఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో డీఈవో రామారావు పాల్గొన్నారు.


ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న రవాణా అధికారులు

## అధిక ఛార్జీలు వసూలు చేస్తే చర్యలు

నెల్లూరు(రవాణా), న్యూస్‌టుడే: అధిక ఛార్జీల పేరిట ప్రయాణికులను వేధిస్తే చర్యలు తప్పవని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ బాల మురళీ కృష్ణ ఆటో డ్రైవర్లను హెచ్చరించారు. డీటీసీ ఆదేశాల మేరకు మంగళవారం నగరంలోని పలు కూడళ్లలో ఆటో డ్రైవర్లకు అవగాహన కలిగించారు. ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు నిర్ణీత ఛార్జీలే వసూలు చేయాలన్నారు. కొంత మంది ప్రయాణికులను ఇబ్బంది పెట్టేలా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు మహమ్మద్ రఫీ, కార్తీక్ పవన్, సహాయ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ పూర్ణచంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా గంధ మహోత్సవం


గంధాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న మత పెద్దలు

నెల్లూరు(పొదలకూరు రోడ్డు), న్యూస్‌టుడే: నెల్లూరు పెద్దబజారు దాడివారివీధిలోని హజ్రత్ సయ్యద్ కంత ర్షా ఔలియా దర్గా 655వ గంధ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామున మేళతాళాలు, ఫకీర్ల జరుబుల మధ్య గంధం ఊరేగింపు జరిగింది. దర్గాకు తీసుకొచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి భక్తులకు పంచిపెట్టారు. రాత్రి భక్తులకు అన్నదానం నిర్వహించారు. బుధవారం ఉదయం 10 గంటలకు తహలీల్ ఫాతెహా, రాత్రి 9.30 గంటలకు ఖవ్వాలి జరగనుంది.

## జడ్పీ ఛైర్‌పర్సన్‌ను కలిసిన ఎంపీడీవోల సంఘ నేతలు

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: జిల్లాలోని వివిధ మండలాలలో పనిచేసే ఎంపీడీవోలు, ఆ సంఘ నేతలు మంగళవారం జడ్పీ ఛైర్‌పర్సన్ అరుణమ్మను కలిశారు. తమను వివిధ మండలాలకు కేటాయించినందుకు, బదిలీలు పారదర్శకంగా నిర్వహించినందుకు ఆమెకు కృతజ్ఞతలు తెలిపి పూలమొక్క అందించారు. కార్యక్రమంలో సంఘ నేతలు, ఎంపీడీవోలు శ్రీహరి, సుబ్బారావు, షలేట్, నాగేంద్ర, వెంకటేశ్వర్లు, రజనీకాంత్, ప్రసన్న పాల్గొన్నారు.

# మాటకు కట్టుబడి పింఛన్ల పంపిణీ


లబ్ధిదారులకు పింఛను అందజేస్తున్న తెదేపా బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: పింఛన్ల పంపిణీలో చెప్పిన మాటకు కట్టుబడి ఉదారంగా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి రాష్ట్ర ప్రజల ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధి పెద్దచెరుకూరులో స్థానిక ప్రజలతో జరిగిన ఆత్మీయ సమావేశంలో మంగళవారం పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి పెన్షన్లు పంపిణీ చేశారు. రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, పశుసంవర్ధకశాఖ జేడీ రమేష్‌నాయక్, తహసీల్దార్ లాజరస్, కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ కృష్ణచైతన్య, తెదేపా స్థానిక నాయకుడు మనుబోలు శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● నగరంలోని 47వ డివిజన్ మహలక్ష్మమ్మ దేవాలయం ప్రాంతంలో తెదేపా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. తెదేపా డివిజన్ నాయకులు డాక్టర్ గణేష్, భాస్కర్, చంద్ర, ఫిరోజ్, నవీన్, సచివాలయ రమేష్, సుమన్, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


ధర్నా చేస్తున్న కార్మికులు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నెల్లూరు నగరపాలకసంస్థలో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు పేర్కొన్నారు. కార్మికుల సమస్యలపై నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాకుండా అభివృద్ధి అసాధ్యమన్నారు. జీతంలో నెలకు లక్షల రూపాయలు మినహాయించుకుంటున్నా.. ఈఎస్ఐ ద్వారా వైద్య సదుపాయం అందడం లేదని తెలిపారు. పనిచేసే వారి కన్నా.. పెత్తనం చేసే వారి సంఖ్య పెరిగిపోయిందని, నగర జనాభా విస్తీర్ణానికి అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కిన్నెర కుమార్, అశోక్, ఎం.శ్రీనివాసులు, లోకేష్, కామాక్షమ్మ, భాగ్యమ్మ, వజ్రమ్మ, మనోజ్, షఫి తదితరులు పాల్గొన్నారు.

### సారూ.. రాయిని ఏర్పాటు చేయలేరా



నగరంలోని డైకస్ రోడ్డు జలపుష్ప భవన్ సమీపంలో నాలుగు రహదారుల కూడలిలో పెద్ద కాలువపై ఉండాల్సిన రాయిని తొలగించారు. అక్కడ పెద్ద గుంత ఏర్పడింది. వర్షమొస్తే కనబడదు. పాదచారులు అందులో పడిపోయే ప్రమాదం ఉంది. సమస్యపై స్థానికులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా పరిష్కారం కాలేదు. కార్పొరేషన్ ఆరోగ్యాధికారి చైతన్య స్పందిస్తూ వెంటనే సమస్య పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

### ప్రయాణమంటే భయమే

నెల్లూరు నగరంలోని విజయమహల్ గేటు వద్ద బాక్సు టైపు వంతెన వంపు తిరిగి ఉంటుంది. ఆపై నీటి తేమతో నిత్యం ద్విచక్రవాహనదారులు జారి పడుతున్నారు. పలువురికి కాళ్లు చేతులు విరిగిన సంఘటనలు ఉన్నాయి. వంతెన లోపల విద్యుద్దీపాల సౌకర్యం లేదు. సాయంత్రమైతే రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. సమస్యను అధికారుల వద్ద మొరపెట్టుకున్నా.. స్పందించలేదని వాహనదారులు వాపోయారు. ఇకనైనా సమస్యలు తీర్చాలని కోరుతున్నారు. – ఈనాడు, నెల్లూరు



### అభివృద్ధి పేరుతో ధ్వంసం



అభివృద్ధి పేరుతో రోడ్లు ధ్వంసం చేసిన అధికారులు వాటికి మరమ్మతులు చేయడంలో నిర్లక్ష్యం చూపుతున్నారు. ముత్తుకూరుగేటు సెంటరులో రోడ్డు ఛిద్రంగా తయారైంది. అభివృద్ధి పనుల కోసం ధ్వంసం చేశారు. నామమాత్రంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకొన్నారు. వర్షాలకు మళ్లీ గోతులు పడ్డాయి. రద్దీ ప్రాంతంలో గుంతలు పడటంతో వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని చోదకులు వాపోతున్నారు. అధికారులు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. –ఈనాడు, నెల్లూరు

### ఆకట్టుకున్న కోలాటం

నెల్లూరు(సాంస్కృతికం), న్యూస్‌టుడే: వైష్ణవి కోలాట మండలి 12వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. పప్పులవీధిలో జేసీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కోలాట మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. కోలాట గురువు పిండి వెంకటలక్ష్మి నిర్వహించిన ఈ కార్యక్రమంలో చీతిరాల పద్మావతి, కొల్లూరు ఝాన్సీ, కీర్తి, స్వాతి, సభ్యులు పాల్గొన్నారు. పాల్గొన్న సభ్యులందరినీ సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.



### ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలి


మొక్క నాటే కార్యక్రమంలో రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు

నెల్లూరు(గ్రామీణం), న్యూస్‌టుడే: హెల్పింగ్ హ్యాండ్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక ధనలక్ష్మీపురంలో జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం, స్థానిక జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు బ్లడ్ గ్రూప్ పరీక్షలు నిర్వహించి, క్రీడాకారులకు దుస్తులు అందజేశారు. ముఖ్యఅతిథిగా నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని తెలిపారు. సొసైటీ వ్యవస్థాపకులు కుంచాల విజయభాస్కర్ పాల్గొన్నారు.

# లోపాలు సరిచేస్తేనే.. భక్తులకు దర్శనం

న్యూస్‌టుడే, నెల్లూరు(సాంస్కృతికం)


దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి దేవస్థానం

శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్దసంఖ్యలో భక్తులు ఆలయాలకు తరలివస్తారు. నెల్లూరులోని దర్గామిట్ట శ్రీరాజరాజేశ్వరి, ఇరుకళల పరమేశ్వరి, స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలను అత్యంత వేడుకగా నిర్వహిస్తారు. గతంలో జరిగిన లోపాలను సరిచేసుకునేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఏటా ఏర్పాట్లపై ఆర్డీవో స్థాయి అధికారి సమావేశాలు నిర్వహిస్తారు. ఉత్సవాలు జరుగుతున్నపుడు ఉన్నతాధికారులు వసతులు.. దర్శనం ఏర్పాట్లను పరిశీలించి చర్యలు తీసుకుంటున్న దాఖలాలులేవు. స్థానిక ఆలయాల ఈవోలకు ఫిర్యాదు చేయాలన్నా వారు అందుబాటులో ఉండరు. ఈ పరిస్థితుల్లో ఉత్సవాల్లో భక్తుల సూచనలు, సలహాలు, ఇబ్బందులను ఫిర్యాదు రూపంలో తెలియజేసేలా టోల్‌ఫ్రీ నంబర్‌ను జిల్లాస్థాయి అధికారులు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తే భక్తులకు సౌలభ్యంగా ఉంటుంది. ఉత్సవాల్లో ఆలయ ధర్మకర్తలు, ఉత్సవ కమిటీ సభ్యులు అయినవారికి దర్శనాలను చేయించటం ఆలయాల్లో చోటు చేసుకుంటోంది. నియమించిన తాత్కాలిక సిబ్బంది సైతం ఇష్టారాజ్యంగా అడ్డదారిలో దర్శనాలకు అనుమతించి క్యూలైన్లలో వచ్చే భక్తులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. భక్తులు అమ్మవారికి సమర్పించేందుకు కొనుగోలు చేసే పూజాసామగ్రి, పూల ధరలను రెండింతలు పెంచి దోచుకుంటున్నారు. ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం. గర్భాలయంలో కుంభ హారతులు నిర్వహించే సమయంలో అలంకార మండపంలో కొలువుదీరిన అమ్మవారి సన్నిధిలో సైతం ఇచ్చి అధిక శాతం భక్తులు తిలకించే ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు.

## పేదలకు భూములపై హక్కులు కల్పించాలి

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: పేద ప్రజలకు భూములపై న్యాయపరమైన హక్కులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం అమరావతి సచివాలయం నుంచి రెవెన్యూ, భూముల రీ సర్వే, ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలు తదితర అంశాలపై కలెక్టర్, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నెల్లూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఒ.ఆనంద్, జేసీ కార్తీక్, డీఆర్వో లవన్న తదితరులు పాల్గొన్నారు.



## బహుమతులు అందజేత

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: గాంధీ జయంతిని పురస్కరించుకుని పీహెచ్‌పీ అసోసియేషన్, రూడ్స్ ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో కొండాయపాళెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న నారాయణ డెంటల్ కళాశాల హెచ్‌వోడీ డాక్టర్ నటరాజన్ కన్నన్ పాఠశాలకు అవసరమైన కలర్ ప్రింటర్‌ను అందజేశారు. అనంతరం పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం దుకాణాల మూసివేత

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న తమను తొలగించడం సరికాదంటూ ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న పలువురు సేల్స్‌మెన్‌లు, సూపర్‌వైజర్లు మంగళవారం దుకాణాలు మూసివేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. నగరంలోని దాదాపు అన్ని ప్రభుత్వ మద్యం మూతపడ్డాయి. విషయం తెలుసుకున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు చొరవ తీసుకుని ప్రభుత్వంతో చర్చిస్తామని హామీ ఇచ్చారు. మధ్యాహ్నం నుంచి దుకాణాలు తెరిచి విక్రయాలు జరిపారు.

## అవోపా అధ్యక్షుడిగా ఏసీఎస్ గుప్తా


అవోపా నూతన కమిటీ

నెల్లూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే: అవోపా నూతన అధ్యక్షుడిగా రెండో దఫా ఎ.చంద్రశేఖర్‌గుప్తా(ఏసీఎస్ గుప్తా) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్టోన్‌హౌస్‌పేటలోని అవోపా కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో శ్రీరామ్ బాబూరావు, శ్రీరామ్ వెంకయ్య పర్యవేక్షణలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా చలువాది పూర్ణచంద్రరావు, కోశాధికారిగా శ్రీరామ్ భరత్, ఉపాధ్యక్షులుగా పెసల సత్యేంద్రకుమార్, తవ్వా శ్రీనివాసులు, అమరా బాలకోటేశ్వరరావు, మరో నలుగురు కార్యదర్శులు, 13 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కమిటీని అవోపా సభ్యులు ఘనంగా సత్కరించారు.

## శాశ్వత ఉద్యోగులుగా నియామకం


సిబ్బందికి నియామక పత్రాలు ఇస్తున్న ప్రిన్సిపల్

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని వర్క్‌షాప్‌లో కొన్ని సంవత్సరాలుగా అటెండర్లుగా పనిచేస్తున్న పలువురిని రెగ్యులర్ నియామకం చేస్తూ మంగళవారం పత్రాలను ప్రిన్సిపల్ రాంప్రసాద్ అందించారు. కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు పోట్ల శ్రీహరి, సీహెచ్ బాబు, శేషయ్యను పూర్తిస్థాయి ఉద్యోగులుగా గుర్తిస్తూ నిర్ణయం తీసుకున్నామన్నారు.

## నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

నెల్లూరు(విద్య): నగరంలోని బీవీ నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్లకొమ్మలు తొలగించడంలో భాగంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు లెక్చరర్స్ కాలనీ, మాగుంట లేఅవుట్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్తుకు అంతరాయం ఉంటుందని ఈఈ ఎం.శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు.

## విద్యుత్తు ఛార్జీల భారం తప్పదు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: ఒక్క రూపాయి కూడా ఛార్జీలు పెంచకుండా నాణ్యమైన విద్యుత్తు అందించడమే లక్ష్యమని ఎన్నికల ముందు ప్రచారం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలోకి రాగానే బాదుడు కార్యక్రమం మొదలు పెట్టారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

# చిన్న సమస్య.. తీవ్ర నిర్లక్ష్యం


అబ్దుల్‌కలాం పార్కులోని వాకింగ్ ట్రాక్‌పై నిలిచిన నీరు

న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

నెల్లూరు నగర ప్రజలు డ్రైనేజీ, రోడ్లు, విద్యుద్దీపాలు, పారిశుద్ధ్యం వంటి సమస్యలతో సతమతమవుతున్నాయి. చిన్నచిన్నవి కూడా పరిష్కారంలో జాప్యం జరుగుతున్నట్లు వాపోతున్నారు. నెల్లూరు నగరంలోని కోటమిట్ట మెక్లిన్స్‌రోడ్డు వీబీఎస్ కల్యాణ మండపం ఎదురుగా ఉన్న డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం పార్కు అధ్వానంగా తయారైంది. వాకింగ్ ట్రాక్‌పై వారం రోజులుగా నీరు నిలిచి నడిచేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పార్కును శుభ్రం చేసేందుకు సిబ్బందిని నియమించినా.. శుభ్రం చేసిన దాఖలాలు లేవు. పార్కులోని ఓపెన్ జిమ్ వ్యర్థాలతో అధ్వానంగా తయారైంది. సిబ్బందికి ప్రతినెలా జీతం చెల్లిస్తున్నారు.

### ప్రమాదకరంగా కల్వర్టు

నర్తకి సెంటరులోని రాయల్‌వీధిలో కాలువపై కల్వర్టు ప్రమాదకరంగా మారింది. వీధిలోకి వెళ్లే ముందు కాలువపై ఉన్న సిమెంటు పలకను పూడికతీత కోసం తొలగించారు. తిరిగి ఏర్పాటు చేయలేదు. వాహనదారులు, ప్రజలు వీధిలోకి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఈ వీధిలోనే ఆసుపత్రి ఉండటంతో రోగులకు ఆటోల్లో రాలేని పరిస్థితి.



### అంధకారం

ములుమూడి బస్టాండు ఆజాద్‌సెంటరులో రాత్రివేళ అంధకారం నెలకుంటోంది. నాలుగు కూడళ్ల రోడ్డు మధ్యలో ఉన్న సెంట్రల్ లైటింగ్ వారం రోజులుగా వెలగడం లేదు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

### ఖాళీ స్థలంలో నీరు

నెల్లూరు నగరంలోని ఖాళీ స్థలాల్లో నీరు చేరి దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. ఇరుగాళమ్మ సంఘం ప్రాంతంలో ఖాళీ స్థలంలో నెలల తరబడి నీరు నిల్వ ఉంది. చుట్టుపక్కల ప్రజలు అవస్థలు పడుతున్నారు. దోమల కారణంగా వ్యాధుల బారిన పడుతున్నామని వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని నగర ప్రజలు కోరుతునారు.

● పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నగరపాలక అధికారులు తెలిపారు.